


- దాదాపు రూ. 8 కోట్లకు పైగా బకాయిలు
- డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలు
- వేతనాలు అందక సాగని పనులు
- కాల్వశ్రీరాంపూర్‌లో కూలీల రభస

వివరాలు 6లో

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



20

పెద్దపల్లి

బుధవారం ▪ 23-8-2017

రెండు మాసాలుగా ఉపాధిహామీ కూలీలకు డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు తవ్విన గుంతలకు బిల్లులు రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 8 కోట్ల రూపాయల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఈ విషయమై కూలీలు మండల కార్యాలయాలు, సంబంధిత అధికారులు, సిబ్బంది చుట్టూ తిరుగుతున్నారు. ఏడాది కాలంగా డబ్బులు రావడం లేదంటూ కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన గ్రామసభలో కూలీలు అధికారులను నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధిహామీ డబ్బులు విడుదల చేయాలని కూలీలు కోరుతున్నారు.

◆ ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి

ఉపాధి కూలీలకు అందని

వేతనాలు..





మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టమధు

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ

- నేడు జిల్లాకు పర్యావరణ బృందం రాక
- ప్రాజెక్టుకు మద్దతు కూడగడుతున్న టీఆర్‌ఎస్
- భూ నిర్వాసితులకు న్యాయం కోసం కాంగ్రెస్
- విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే పుట్ట మధు

◆ ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి 3లో

సామరస్యంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

6లో

దేశ వ్యాప్తంగా ఒకే గొడుగు కిందికి కార్మికులు



మాట్లాడుతున్న గోవర్ధన్

- కార్మిక చట్టాల సవరణ, చట్టాల సంఖ్య కుదింపు
- కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని ప్రతిపాదనలు
- కార్మికుల సంక్షేమానికి మోదీ సర్కారు కృషి
- కేంద్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్ ఆవుల గోవర్ధన్

◆ జ్యోతినగర్ 3లో

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు...
- ఘనంగా జానపద కళా ఉత్సవం



కళా ప్రదర్శనలిస్తున్న కళాకారులు

20

జానపద కళలను ప్రోత్సహించండి

- సాంస్కృతిక కళా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ
- ప్రారంభించిన జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు కృషి ...

హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి బాసరవేని లక్ష్మణ్



ఇంటర్వ్యూ

కరీంనగర్ స్పోర్ట్స్: హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బాసరవేని లక్ష్మణ్ అన్నారు. జిల్లాలో హ్యాండ్‌బాల్‌కు మంచి ఆదరణ ఉందని ఆయన తెలిపారు. పలువురు క్రీడాకారులు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాస్టల్‌లో ప్రవేశం పొంది పలు ఉద్యోగాలు సాధించారన్నారు. ఆయన ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి: జిల్లా క్రీడాకారుల ప్రతిభ ఎలా ఉంది?

లక్ష్మణ్: రాష్ట్రంలో జిల్లా హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు తిరుగు లేదు. పురుషుల జట్టు, జూనియర్స్ జట్టుకు నేను కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పలు కోచింగ్ క్యాంపులు నిర్వహించాము. జిల్లాకు చెందిన బాస మహేశ్ నేషనల్ హ్యాండ్‌బాల్ అకాడమీకి ఎంపికై అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు.. ఎం జయంత్, రమేష్, అనిల్ కుమార్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాలు సాధించారు.

ఆంధ్రజ్యోతి: హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నాయి?

లక్ష్మణ్: హ్యాండ్‌బాల్ అంతర్జాతీయ స్థాయి క్రీడ. ప్రపంచంలో వేగవంతమైన క్రీడ. జాతీయస్థాయి, అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలీస్, రైల్వేస్, డిఫెన్స్, ఆర్మీ విభాగాల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. జిల్లాకు చెందిన ఎస్ శ్రీనివాస్, డి మల్లేవ్, సంగీత్‌కుమార్, శ్రీనివాస్ వివిధ సంస్థల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: క్రీడాభివృద్ధికి మీరు తీసుకుంటున్న చర్యలు?

లక్ష్మణ్: జిల్లాలో హ్యాండ్‌బాల్ క్రీడకు మంచి ఆదరణ ఉంది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి పోటీలు నిర్వహిస్తున్నాం. ఇది ఒలంపిక్ క్రీడ కాబట్టి విద్య, ఉద్యోగ రిజర్వేషన్లకు ఉపయోగపడుతుంది. జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ప్రయాణఖర్చులు, దుస్తులు పంపిణీ చేస్తున్నాము.

ఆంధ్రజ్యోతి: మీ భవిష్యత్ కార్యక్రమాలు ఏమిటి?

లక్ష్మణ్: కరీంనగర్‌లోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర కార్యదర్శి ప్రతిభగల క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రతిఏటా తెలంగాణ టాలెంట్ హంట్ నిర్వహిస్తాము.క్రీడాభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశాం. వచ్చే విద్యాసంవత్సరం రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం.

ఆంధ్రజ్యోతి: మీ క్రీడా నేపథ్యం ఏమిటి?

లక్ష్మణ్: నేను మొదటి నుంచి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడినే. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ పలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. హ్యాండ్‌బాల్ క్రీడలో మినీ నుంచి సీనియర్ నేషనల్ వరకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించాను. మూడుసార్లు రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించాను. జిల్లా నుంచి మొదటి సీనియర్ నేషనల్ ఆడిన వ్యక్తిని నేను. ఇండియా క్యాంప్‌కు ఎంపికయ్యాను. హ్యాండ్‌బాల్ క్రీడలో గాంధీనగర్ గుజరాత్‌లో ఎన్ఐఎస్ చేశారు. వ్యాయామ విద్యను అభ్యసించాను. నా శిక్షణలో 300 మందికి పైగా శిక్షణ పొంది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు.

పిల్లలు పిడుగులు



ఖేల్

ఈ పిల్లలు చూడడానికి అమాయకుల్లా ఉంటారు. కాని బరిలోకి దిగారంటే ప్రత్యర్థులకు చుక్కలు చూపుతారు..కుంగ్‌ఫూలో అద్భుతమైన ప్రతిభను చూపుతూ పలువురి మన్ననలు అందుకుం టున్నారు. వైవిధ్యమైన రీతిలో కుంగ్‌ఫూ విన్యాసాలు చేస్తూ ఎదుటి వారిని భయభ్రాంతులకు గురి చేస్తారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తమో కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమిలో రెండు సంవత్సరాలుగా కోచ్ ఆర్ ప్రసన్నకృష్ణ వద్ద శిక్షణ పొందుతున్న వీరు తమ ప్రతిభతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ పతకాలను సాధిస్తున్నారు. ప్రత్యర్థుల దాడి నుంచి తమను తాము రక్షించుకోవడానికి వీలుగా కుంగ్‌ఫూలోని ఎనిమల్ స్టైల్స్‌ను, అటాకింగ్స్, బ్లాకింగ్ అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. వెపన్, నాన్‌చాక్, కర్రసాము, కత్తిసాము, తదితర అంశాలను ప్రదర్శించడం వీరి ప్రత్యేకత. పలు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు.. వీరిని ఆంధ్రజ్యోతి పలకరించగా వారు తెలిపిన అభిప్రాయాలు...

◆ కరీంనగర్ స్పోర్ట్స్



కుంగ్‌ఫూతో ఆత్మస్థైర్యం..

- ఆర్ ప్రసన్నకృష్ణ, కోచ్



కుంగ్‌ఫూ నేర్చుకోవడం వల్ల మొదటగా విద్యార్థులలో శారీరక శక్తి పెరుగుతుంది. ఎంతో ఆత్మస్థైర్యంగా, ధైర్యంగా ఉంటారు. కుంగ్‌ఫూ నేర్చుకున్న వారు ఎలాంటి ఆటలలోనైనా నైపుణ్యం సాధించ గలరు. కుంగ్‌ఫూ అనేది క్రీడనే కాదు. ఒక అద్భుతం, దాని గురించి మాటల్లో వివరించలేం. జిల్లా క్రీడాకారులు ఈ ఆటలో మంచి ప్రతిభను చాటుతున్నారు.

● అన్నయ్య స్ఫూర్తితో...

- సిహెచ్ హర్షిత



మా అన్నయ్యను చూసి నేను కూడా ప్రతి రోజు ఉదయం కుంగ్‌ఫూ తరగతులకు వెళ్తున్నాను. కుంగ్‌ఫూ క్రీడను చాలా కష్టంతో ఇష్టపడి నేర్చుకుంటున్నాను. ఈ శిక్షణతో భవిష్యత్తులో నేను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని పతకాలు సాధిస్తా. వరంగల్, కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి, ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...

- జె శ్రీచరణ్



మాది చాలా పేద కుటుంబం. తల్లిదండ్రుల ప్రోత్సహంతో కుంగ్‌ఫూలో శిక్షణ తీసుకుంటున్నాను. రాష్ట్రంలో వివిధ జిల్లాలో జరిగినటు వంటి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో పతకాలు సాధించాను. మెరుగైన శిక్షణను తీసుకొని అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధిస్తాను. ఇప్పటి వరకు మూడు రాష్ట్ర స్థాయి, ఒక జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను.

కుంగ్‌ఫూ అంటే నాకు చాలా ఇష్టం...

- సిహెచ్ చరణ్‌తేజ



నాకు చిన్నతనం నుంచి యుద్ధకలలపైన ఆసక్తి ఉండేది.. దీనిని గమనించిన నా తల్లిదండ్రులు కుంగ్‌ఫూలో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఫలితంగా రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు జరిగిన పోటీల్లో నేను పాల్గొని ప్రతిభ చాటాను. ప్రతి టోర్నమెంట్‌లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాను. ఇంకా ఇలాంటి విజయాలు సాధిస్తా.

ఐఏఎస్ లక్ష్యంగా ముందుకు...

- ఈ అంజనా



నా తల్లిదండ్రుల ప్రోత్సహంతో కుంగ్‌ఫూలో శిక్షణ తీసుకుంటున్నాను. ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు శిక్షణలో పాల్గొంటాను. ఇది వరకు ఎన్నో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించాను. ఈ శిక్షణతో పొందిన ధైర్యం, సహస లక్షణాలతో భవిష్యత్తులో ఐఏఎస్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను.

ఇల్లందకుంట ఆలయ సమాచారం

ఇల్లందకుంట: అపర భద్రాదిగా పేరుగాంచిన శ్రీసీతా రామచంద్రస్వామి దేవాలయంలో భక్తులతో కిటకిటలాడుతుంది. భక్తుల సౌకర్యార్థం పాలకవర్గం వివిధ రకాలైన ఆర్జిత సేవలను అందుబాటులో ఉంచింది. వచ్చే శ్రావణ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తులు పెద్దఎత్తున తరలివస్తారని భావించిన పాలకవర్గం ఏర్పాట్లు చేస్తుంది.

ఉదయం 3:45 గంటలకు మంగళ వాయిద్యాలు

4:30 గంటలకు సుప్రభాతం

5 గంటలకు పూజ కార్యక్రమాలు

6 గంటల నుంచి 7గంటల వరకు ఆరాధన

7 గంటల నుంచి 11:50 గంటల వరకు స్వామివారి దర్శనం, తీర్థ ప్రసాద వితరణ, అర్చన, ఆర్జిత సేవలు జరుపబడును.

మధ్యాహ్నం 12 గంటలకు ద్వార బంధనం, రాజభోగం, ఆరగింపు



● 12గంటల నుంచి 6గంటల వరకు స్వామివారి సర్వదర్శనం సాయంత్రం: 6 నుంచి 7:30 గంటల వరకు స్వామి వారి లఘు దర్శనం రాత్రి 10 గంటలకు ద్వార బంధనం

ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా నిధులు అందించాలి

● కట్ట సంతోష్, పెటా జిల్లా సభ్యుడు

ఉద్యోగి వాయిస్



కరీంనగర్ స్పోర్ట్స్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన క్రీడా నిధులు లేక పాఠశాలల్లో క్రీడలు కనుమరుగ వుతున్నాయి. జిల్లాలోని పాఠశాలల్లో క్రీడాకారులు తయారవుతున్నప్పటికి ఈ పాఠశాల స్థాయిలో నిధులు లేకవారు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనలేక పోతున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు తమ సొంత డబ్బులు వెచ్చించి క్రీడాకారులను జిల్లా రాష్ట్ర స్థాయి పోటీలకు తీసుకువెళుతున్నారు. దీంతో అనేక మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన లేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా నిధులను అందించాలి. వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను అప్‌గ్రేడ్ చే స్తున్నామని జీవోను విడుదల చేసినప్పటికీ ఆ ప్రక్రియను ప్రారంభించలేదు. ఇకనైనా పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలి. సీపీఎస్ విధానా న్ని రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులంద రికి జీపీఎఫ్ విధానాన్ని ప్రారంభించాలి. ఈ విద్యా సంవత్సరం నుంచైనా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న క్రీడా వసతులను మెరుగు ప ర్చేందుకు అవసరమైన క్రీడా నిధులను ప్రభుత్వం అందించాల్సిన అవసరం ఉంది. మైదానాలు లేని ప్రభుత్వ పాఠశాలలకు మైదానాలను కేటాయించి వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలి. ఎస్‌జీఎఫ్ క్రీడలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన నిధులను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించాల్సిన అవసరం ఉంది.

ఆహ్వానించి.. అవమానించారు..

● ఎక్సైజ్ అధికారులపై ఇన్‌చార్జి కలెక్టర్‌కు జడ్పీటీసీ ఫిర్యాదు

గోదావరిఖని : ఓ ప్రభుత్వ కార్యక్రమానికి రామగుండం జడ్పీటీసీ కందుల సంధ్యారాణిని ఆహ్వానించి రామగుండం ప్రాంత ఎక్సైజ్ అధికారులు ఆమె పట్ల అమర్యాదగా వ్యవహరించిన తీరు వివాదానికి దారి తీసింది. ఈ విషయంలో కలత చెందిన సంధ్యారాణి మంగళవారం ఇన్‌చార్జి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...



ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న జడ్పీటీసీ సంధ్యారాణి

రామగుండం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 99శాతం గుడుంబా రహితంగా మార్చిన సందర్భంగా గుడుంబా వ్యసనం నుంచి విముక్తి పొందిన కొంత మందిని గుర్తించి వారికి స్వయం ఉపాధి కోసం నిధులు మంజూరు చేశారు. లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు గోదావరిఖని శ్రీనగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం బహిరంగ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణ, ఇతర ప్రజా ప్రతినిధులతో పాటు జడ్పీటీసీ సంధ్యారాణిని ఆహ్వానించారు. దీంతో సంధ్యారాణి సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలోని వేదికపైకి ప్రజాప్రతినిధులతో పాటు ఇతరులను కూడా ఎక్సైజ్ అధికారులు ఆహ్వానించారు. కానీ జడ్పీటీసీ కందుల సంధ్యారాణిని ఆహ్వానించలేదు. ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో సందేశం ఇచ్చినా జడ్పీటీసీకి ఆ అవకాశం కల్పించలేదు. దీంతో జడ్పీటీసీ తాను సందేశం ఇస్తానని కోరినా పట్టించుకోకపోవడంతో ఆమె తీవ్ర మనస్థాపానికి గురయ్యారు.

వెంటనే ఈ విషయంపై ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తనను సమావేశానికి పిలిచి ప్రొటోకాల్ ఉల్లంఘించి అవమానించారని, దీనికి బాధ్యులైన ఎక్సైజ్ సూపరింటెండెంట్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్, అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ సంధ్యారాణి ఇన్‌చార్జి కలెక్టర్‌ను కోరారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ

● నేడు జిల్లాకు పర్యావరణ బృందం రాక

ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల కోసం బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఇందుకు రాఘవాపూర్‌లోగల రెడ్డి ఫంక్షన్‌హాల్ వేదిక కానున్నది. కేంద్ర పర్యావరణ బృందం, జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఉదయం 11 గంటల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజల మద్దతును కూడగట్టేందుకు అధికార టీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు రంగంలోకి దిగారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులు సైతం భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని, పరిహారం చెల్లింపులో ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించిందని, పర్యావరణ బృందం ఎదుట తమ వాదనను వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే భూ నిర్వాహితులను సమీకరించే పనిలో వారు నిమగ్నులైనారు. తమకు రావాల్సిన పరిహారం విషయమై గట్టిగా వాదనలు వినిపించాలని వారికి చెప్పినట్లు సమాచారం.

తెలంగాణ భూములను సస్యశ్యామలం చేసేందుకు ప్రాజెక్టులను రీడిజైన్ చేసిన ప్రభుత్వం రివర్స్ ఎత్తిపోతల ద్వారా కాళేశ్వరం నుంచి గోదావరి, ప్రాణహిత జలాలను తరలించేందుకు ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీలతోపాటు పంపుహౌజ్ నిర్మాణాలను చేపడుతున్నారు. ఈ పనులకు గత యేడాది మే 2న సీఎం కేసీఆర్ మేడి గడ్డ వద్ద శ్రీకారం చుట్టారు. వచ్చే యేడాది జూలై నాటికి మిడ్ మానేరుకు కాళేశ్వరం జలాలను తరలించేందుకు పనులు వేగంగా సాగుతున్నాయి. జిల్లాలో సుందిల్ల బ్యారేజీతోపాటు సిరిపురం, గోలివాడ పంపుహౌజ్ నిర్మాణాలు సాగుతున్నాయి. వీటికి కావాల్సిన భూ సేకరణ దాదాపుగా పూర్తి కావచ్చింది.

జీవో నెంబర్ 123, భూ సేకరణ చట్టం 2013 ప్రకారం భూములను సేకరించారు. మరికొన్ని భూములను సేకరించాల్సి ఉంది. పరిహారం విషయంలో కొందరు రైతులు కోర్టును ఆశ్రయించడంతో పనుల్లో కాస్త జాప్యం జరిగింది. అయితే గోలివాడ రైతులకు అందరి కంటే ఎక్కువ పరిహారం చెల్లించారని, అదే తరహాలో తమకు కూడా పరిహారం ఇవ్వాలని సిరిపురం ప్రాంతానికి చెందిన కొందరు రైతులు ఇటీవల పనులు అడ్డుకొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఒక రైతుపై కేసు కూడా నమోదైంది. వారికి అండగా నిలిచిన కాంగ్రెస్ నేతలు నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణం విషయంలో తాము వ్యతిరేకం కాదని, రాష్ట్రంలో తమ హయాంలోనే ప్రాజెక్టులకు రూపకల్పన చేశామని వారు చెబుతున్నారు. భూ నిర్వాసితులకు మాత్రం న్యాయం జరిగే వరకు వారికి మద్దతుగా నిలుస్తామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు, నిర్వాసితులు హాజరు కానున్నారు.

ప్రజాభిప్రాయాన్ని సేకరణను విజయవంతం చేయాలి

మంథని : కాళేశ్వరం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల కోసం బుధవారం రాఘవాపూర్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే పజాభిప్రాయాన్ని సేకరణను విజయవంతం చేయాలని మంథని ఎమ్మెల్యే పుట్ట మధు కోరారు. ప్రాజెక్టులపై బుధవారం నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమ నేపథ్యంలో నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఏఎంసీ, పీఏసీఎస్ చైర్మన్లు, మండల పార్టీ అధ్యక్షులతో ఎమ్మెల్యే పుట్ట మధు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలోని బ్యారేజీలు, పంపుహౌజ్‌ల వలన కలిగే ప్రయోజనాలను అధికారులకు వివరించడానికి రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. నియోజకవర్గంలోని మత్స్య కారులు, గొల్ల కుర్మలు, వ్యవసాయ కూలీలు, వివిధ కుల వృత్తులవారు ప్రజాభిప్రాయ సేకరణలో తమ అభిప్రాయాలను వెల్లడించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అడ్డుకుంటుందన్నారు. ప్రాజెక్టులు సకాలంలో పూర్తి అయ్యేతే తమకు రాజకీయ మనుగడ ఉండదనే భావనతో అడ్డుకుంటుందన్నారు. కేసీఆర్‌కు వ్యవసాయ పురస్కారంపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శమని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్ట మధు

దేశ వ్యాప్తంగా ఒకే గొడుగు కిందికి కార్మికులు

జ్యోతినగర్ : దేశ వ్యాప్తంగా ఒకే గొడుగు కిందికి కార్మికులను చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, రాష్ట్రాలలో వేర్వేరు పాలసీలు ఉండడం వల్ల కార్మికులకు నష్టం జరుగుతున్నదని కనీస వేతనాల బోర్డు(కేంద్ర) చైర్మన్ ఆవుల గోవర్ధన్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్టీపీసీ ఈడీసీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కనీస వేతనాలు ఒక్కో రాష్ట్రంలో ఒక విధంగా ఉన్నాయని, తెలంగాణతోపాటు కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు కార్మిక వర్గాన్ని ఏకీకృతం చేసేందుకు విముఖత చూపుతున్నారన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులకు సమాన స్థాయిలో వేతనాలు అందేలా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే ప్రైవేటు పరిశ్రమలు రావనే సాకుతో కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. దేశంలోని అసంఘటిత రంగ కార్మికులకు నెలకు 18 వేల రూపాయలు కనీస వేతనంగా ఇవ్వాలని మినిమం వేజ్‌బోర్డు ప్రతిపాదనలు చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రూపొందించిన 44 కార్మిక చట్టాల్లో చాలా చట్టాలు నిరుపయోగంగా ఉన్నాయని, కార్మికులకు అధిక ప్రయోజనకరంగా ఉండేలా చట్టాల సంఖ్యను తగ్గించేందుకు ఎన్‌డీఏ సర్కారు చట్ట సవరణ చేయనుందని ఆయన తెలిపారు. ప్రధానంగా కనీస వేతనాలు, వేతనాలు చెల్లించే విధానాలు(పేమెంట్ ఆఫ్ వేజెస్), పీఎఫ్, 12 వేల రూపాయల వేతనాలకు లోబడే కార్మికులకు వర్తిస్తున్న ఈఎస్ఐని 26 వేల రూపాయలకు పెంచేలా చట్ట సవరణ చేస్తున్నారన్నారు. అలాగే కార్మికుల జీవన ప్రమాణాలు పెరిగేందుకు, కార్మికుల కనీస వేతనాలు శాస్త్రీయ పద్ధతిలో పెంచేలా 6 పాయింట్ల విధానాన్ని అమలు చేసేందుకు కసరత్తు జరుగుతున్నదని చెప్పారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత కార్మిక వర్గ ప్రయోజనాల పరిరక్షణకు ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. విలేకరుల సమావేశంలో బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజిరెడ్డి,బూర్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కార్మికులు, అధికారులతో సమీక్షా సమావేశం..

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు, పెండింగ్ అంశాలకు సంబంధించి మినిమం వేజ్‌బోర్డు చైర్మన్ ఆవుల గోవర్ధన్ మంగళవారం ఈడీసీ మిలీనియం హాలులో సమీక్ష నిర్వహించారు. గతంలో వివిధ డిమాండ్లతో నెల రోజులపాటు కార్మికులు చేసిన సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందం అమలు విషయాలను ఆయన నేరుగా కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అయితే 3 వేల రూపాయలు అడ్వాన్స్ ఇచ్చిన పది నెలల్లో కోత విధించాల్సి ఉండగా మొదటి నెలలోనే ఆ మొత్తాన్ని అక్రమంగా రికవరీ చేశారని కార్మికులు గోవర్ధన్ దృష్టికి తెచ్చారు. అలాగే బోనస్ విషయంలో లోపాలు, కార్మికుల స్కిల్ అప్‌గ్రేడేషన్‌ను నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గుర్తింపు కార్మికుల ఎన్నికలకు సంబంధం లేకుండా కార్మికుల సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాహూ, ఎన్టీపీసీ అధికారులు బాలసుందరం, దేవదాసు, యూపీఎల్ అధికారి రాయ్, బీఎంఎస్ నాయకులు కౌశిక హరి, రాజిరెడ్డి, భట్టాచార్య, బూర్ల లక్ష్మీనరాయణ, క్యాతం వెంకటరమణకరుణాకర్‌రెడ్డి, టి.శ్రీనివాస్, గోపు కనకయ్య, కార్మికులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు
పోలీసులు చిత్తశుద్ధితో పనిచేయాలి

జ్యోతినగర్ : జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసులు చిత్తశుద్ధితో పని చేయాలని డీసీపీ విజేందర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఎన్టీపీసీ ఈడీసీ లెక్చర్ హాలులో జిల్లా నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత నిస్తూ ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. జిల్లాలో నేరాల సంఖ్య తగ్గిందని, ఇదే స్ఫూర్తితో పని చేయాలని ఆయన సూచించారు. జిల్లా పరిధిలో పెండింగ్ కేసులు, కోర్టు పరిధిలో ఉన్న కేసుల ట్రయల్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తదితర అంశాలపై డీసీపీ సమీక్ష చేశారు. రానున్న వినాయక నవరాత్రోత్సవాలను శాంతియుతంగా జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ సింధుశర్మ, గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ విజేందర్‌రెడ్డి

ముగిసిన క్వాలిటీ సర్కిల్ సదస్సు

జ్యోతినగర్: రామగుండం ఎన్‌టీపీసీ ఈడీసీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రాజెక్టు స్థాయి నాణ్యతా సంఘాల సదస్సు మంగళవారం సాయంత్రం ముగిసింది. మొత్తం ప్రాజెక్టులోని వివిధ విభాగాలకు చెందిన పదికిపైగా క్వాలిటీ సర్కిల్స్ పాల్గొని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సదస్సులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నిర్వాణ్ చక్ర, క్వాలిటీ సర్కిల్‌కు ప్రథమ స్థానం, దక్షితకు రెండవ స్థానం, కేమ్‌స్టార్‌కు మూడవ స్థానం, ఇన్నోలిటివ్‌కు నాలుగోస్థానం, విజన్‌కు ఐదోస్థానం సాధించారు. విజేతలకు ఎన్‌టీపీసీ జీఎం రవీంద్ర బహుమతులు అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

అంతర్గాం: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో రెండో దఫా ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో ఈ నెల 22 నుంచి 28వరకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని రామగుండం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్ మోహన్‌రెడ్డి కోరారు. iti telangana.govt.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ కోరారు.

మట్టి వినాయకులను పూజిద్దాం



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: మట్టి వినాయకులను పూజిద్దాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఆర్జీ-2 యాజమాన్యం మంగళవారం కాలనీలో ర్యాలీ నిర్వహించింది. ర్యాలీని జీఎం విజయబాబు జండా ఊపి ప్రారంభించగా కాలనీ పురవీధులగుండా సాగింది. ఈసందర్భంగా జీఎం మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు తోట్పడేలా ప్రతి ఒక్కరు మట్టివినాయక ప్రతిమలనే ప్రతిష్టించాలని పిలుపునిచ్చారు. ఎనిమిదేళ్ళుగా స్థానికంగా మట్టివినాయక ప్రతిమలను సింగరేణి తయారు చేయిస్తున్నట్టు తెలిపారు. ప్రకృతికి హానిచేసే ప్లాస్టర్‌ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను నెలకొల్పవద్దని సూచించారు. ఈర్యాలీలో ఎస్‌ఓటూ జీఎం రవీందర్, డీజీఎంలు ఎన్‌వీరావు, రావకృష్ణ, పర్యావరణఅధికారి రాజారెడ్డి, టీబీజీకేఎస్, హెచ్‌ఎంఎస్ నాయకులు ఐలిశ్రీనివాస్, గోపాల్‌రెడ్డిలతోపాటు పలువురు అధికారులు, కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరులో కార్డన్‌సెర్చ్

యైటింక్లయిన్‌కాలనీ: కార్పొరేషన్ 43వడివిజన్ అల్లూరులో మంగళవారం టూటౌన్ పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతిఇంటిలో నివసిస్తున్న వారి వివరాలు సేకరించారు. అనుమానితుల ఇళ్ళను తనిఖీ చేశారు. ద్విచక్రవాహనాల పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ దేవారెడ్డి గ్రామస్థులతో మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్డన్‌సెర్చ్‌లో ఎస్సైలు నాగేశ్వరరావు, భాస్కర్‌రావు, కరీంబేగ్, మధుసూధన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో రుబెల్లా వ్యాక్సిన్

అంతర్గాం: లింగాపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సర్పంచ్ అర్శనపల్లి మల్లీశ్వరీశ్రీనివాస్ ఆధ్వర్యంలో తట్టు, రుబెల్లా నివారణ వ్యాక్సిన్‌ను ఏఎన్‌ఎం పిల్లలకు వేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సరోజన, ఉమామహేశ్వరి, ఆశా వర్కర్ మంజుల, అరుణకుమారి పాల్గొన్నారు.

కేశోరాం కార్మిక సంక్షేమానికే కృషి

● బీజేపీ నాయకుడు కౌశిక హరి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కార్మిక సంక్షేమానికి కృషి చేస్తానని, గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓడినా, గెలిచినా కార్మి కుల వెంటే ఉంటానని బీజేపీ నాయకుడు, పర్మనెంట్ కార్మిక సంఘం అధ్యక్ష అభ్యర్థి కౌశికహరి హామీ ఇచ్చాడు. కంపెనీలో రేపు జరిగే పర్మనెంట్ కార్మిక సంఘం ఎన్నికల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కంపెనీలో తాను ఏనాడు ఓడినా, గెలిచినా కార్మికుల కష్టాల్లో పాలుపంచుకున్నానని తెలిపాడు. 24న జరిగే ఎన్నికల్లో తన ప్యానల్‌ను గెలిపిస్తే గతంలో కన్నా మరింత ఉత్సాహంగా పని చేస్తానని తెలిపాడు. ఈ ప్రచారంలో ప్రధాన కార్యదర్శి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తోడేటి రవికుమార్, నాయకులు సూర సమ్మయ్య, ఎండీ ఫయాజ్, ఎర్రం స్వామి, తోట నారాయణ, మాదాసు రాజ్‌కుమార్, ముత్యం సంతోష్, ఎండీ ఇబ్రహీం, పాత బాపుశెట్టి, తంగెడ అనీల్‌రావు, ధరణి మల్లేష్, మల్లయ్య పాల్గొన్నారు.

గుడుంబా రహితంగా మార్చడమే లక్ష్యం

● పునరవాసం కింద లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ



లబ్ధిదారునికి చెక్కు, ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే

గోదావరిఖని: తెలంగాణ పల్లెలను గుడుంబా రహితంగా చేయడమే కేసీఆర్ లక్ష్యమని, గుడుంబాపై ఆధారపడి జీవించే వారికి ఉపాధి మార్గాలు చూపిస్తున్నారని ఆర్‌టీసీ చైర్మన్, ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు.

మంగళవారం శ్రీనగర్‌కాలనీలో ఎక్సైజ్ కార్యాలయంలో గుడుంబా అమ్మకాలు మానేసిన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పల్లెలు, పట్టణాల్లో గుడుంబా బారిన పడి అనేక కటుంబాలు బజారుపాలయ్యాయని, వీటిని అరికట్టడానికి కేసీఆర్ సూచనల మేరకు ఎక్సైజ్‌శాఖ అవిశ్రాంతంగా శ్రమించి విజయం సాధించిందని, రామగుండం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 99శాతం గుడుంబాను అరికట్టడం జరిగిందన్నారు. ఈ పథకంలో గుడుంబా అమ్మకాలు పూర్తిగా మానేసిన వారిని అర్హులుగా గుర్తించడం జరిగిందని, రామగుండం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 38మంది గుడుంబా పూర్తిగా అమ్మకాలు మానేసిన వీరికి కిరాణ దుకాణం, చికెన్ సెంటర్, ఆటో రిక్షా, టెంట్‌హౌస్, డైరీఫాం, మేకలు, గొర్రెలు, బట్టల దుకాణాలు నెలకొల్పుకోవడానికి ప్రతి ఒక్క లబ్ధిదారుడికి రూ.2లక్షల పంపిణీ చేసినట్టు తెలిపారు. మరో పది మందికి త్వరలోనే పునరావాసం కల్పించనున్నట్టు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆడెపు రాజేశం, టీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ ముప్పిడి సత్యప్రసాద్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎక్సైజ్ సీఐ రమేష్, స్త్రీ, శిశు సంక్షేమ ఆర్గనైజర్ మూల విజయారెడ్డి, కార్పొరేటర్ వడ్లూరి రవి పాల్గొన్నారు.

బొగ్గు బావులపై పచ్చదనం, పరిశుభ్రత



స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న జీఎం , అధికారులు



మొక్కలు నాటుతున్న జీఎం విజయపాల్‌రెడ్డి, మహిళలు

గోదావరిఖని: సింగరేణి బొగ్గు బావులపై పచ్చదనం సంతరించుకోనున్నది. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛ పక్వాడా కార్యక్రమం మంగళవారం ఆర్‌జీ-1 ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్ నుంచి ప్రధాన చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రాంతంలోని పాఠశాలల విద్యార్థులు, సింగరేణి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, కార్మికసంఘల నాయకులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. ఆర్‌జీ-1 జీఎం విజయపాల్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు శకుంతలవిజయపాల్‌రెడ్డి, ఎస్‌ఓటూ జీఎం త్యాగరాజు, జీడీకే 1, 5, 11గ్రూప్ ఏజెంట్లు సాంబయ్య, మనోహర్‌రావు, ఎంఓ సీపీ అధికారి నరేందర్, సీఎంఓఏఐ ఆర్‌జీ-1 అధ్యక్షుడు పీ శ్రీనివాస్, డీజీఎం (పర్సనల్) హనుమంతరావు, ఏజీఎం ప్రసాద్‌రావు, డీజీఎం(సివిల్) నవీన్, పీఎం శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ అధికారి అంబటి శ్రీనివాస్, ఫారెస్టు ఆఫీసర్ డేవిడ్ అభిలాష్, నాయకులు ప్రవీణ్, యాదగిరి సత్తయ్య పాల్గొన్నారు. అలాగే ఆర్‌జీ-1 జీడీకే 2ఏ గనిపై కార్మికులు పిచ్చిమొక్కలను తొలగించారు. పరిసరాలను శుభ్రం చేసి పండ్లమొక్కలు నాటారు. గ్రూప్-1 ఏజెంట్ సాంబయ్య, మేనేజర్ మల్లేష్, అధికారులు లక్ష్మణ్‌రావు, వినాయక్, రవీంద్రకుమార్, నాయకులు పాల్గొన్నారు.

కృషిభవన్‌కు బస్ నడపాలని వినతి

యైటింక్లయిన్‌కాలనీ: డ్యూటీ సమయాల్లో ఓసీపీ-3 కృషిభవన్‌కు బస్సు డపాలని టీబీజీకేఎస్ నాయకులు ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చినవారిలో కొంగర రవీందర్, ఎల్కపల్లి సదయ్య, ఆకుల రాజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బుదార్థిబాపు, రవీందర్‌లు ఉన్నారు.

ఇంటర్వ్యూ



ఉపాధిహామీలో హరితహారంకే ప్రాధ్యానం

-రమేష్, ఏపీఓ, రామగుండం

ప్ర: మహాత్మాగాంధీ ఉపాధిహామీ (ఈజీఎస్)లో ఏపనులకు ప్రాధాన్యత ఇస్తారు?

జ: ప్రస్తుతం తెలంగాణ హరితహారంలో మొక్కలు నాటే కార్యక్రమానికి మాత్రమే పరిమితం చేశాం.

ప్ర: మండలంలో ఎంత మందికి ఉపాధి దొరుకుతుంది ?

జ: ఉమ్మడి రామగుండం మండలంలో ఎనిమిది గ్రూపులు ఉన్నాయి. 6వేల కుటుంబాల్లో 9వేల మందికి పని కల్పించాం. ఈ సంవత్సరం ఏప్రిల్, మే, జూన్, జూలై నాలుగు మాసాలకు గాను రూ.2.12లక్షల పని దినాలను కల్పించాం.

ప్ర: ఎన్ని మొక్కలు నాటారు?

జ: లక్ష్యం 3.2లక్షలు కాగా ఇప్పటి వరకు 2లక్షల మొక్కలునాటాం. సెప్టెంబర్ నుంచి ప్రతి గ్రామంలో 500మొక్కలకు ఒక రక్షణ కాపాలా, నీరు అందించే ఉపాధి కూలీని నియమిస్తాం. ఈజీఎస్ పని దినాల ప్రకారమే కూలి అందిస్తాం. మొక్కలను పెంచేందుకు అన్నీ రకాల సహాయ సహకారం అందిస్తాం. **-అంతర్గాం**

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● నిరాహార దీక్ష చేపట్టిన ఎంప్లాయీస్ యూనియన్



దీక్ష చేస్తున్న ఈయూ నాయకులు, కార్మికులు

లక్ష్మీనగర్: ఆర్‌టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గోదావరిఖని డిపో ఎదుట ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం నారాయణ, కడారి సునీల్ ముఖ్య అతిథులుగా హాజరై దీక్షలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. 2017ఏప్రిల్ 1 నుంచి రావాల్సిన పే స్కేల్ వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో వెంటనే 30శాతం ఐఆర్ ఇవ్వాలని, ఆర్‌టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ప్రైవేట్ బస్సుల అక్రమ రవాణాను అరికట్టాలని, అద్దె బస్సులను రద్దు చేసి ఆర్‌టీసీ బస్సులను పెంచాలని అన్నీ ఖాళీలను రెగ్యులర్ ప్రాతిపదికన రిక్రూట్‌మెంట్ చేయాలని, కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెట్టాలని, ఎంటీడబ్ల్యూ చట్టం ప్రకారం డబుల్ డ్యూటీకి డబుల్ వేజెస్ ఇవ్వాలని, నైట్ అవుట్ సర్వీస్‌లకు నాణ్యమైన రెస్టరూమ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు శనిగల శ్రీను, బీ రమేష్‌కుమార్, ఎంఎస్ కుమార్, శంకర్, గోవర్ధన్, హుస్సేన్, ఏఆర్‌రెడ్డి, రాజన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ముత్తారం: మండలంలోని కేశనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ధరియాపూర్‌లోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా వచ్చిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



సిద్ధమవుతున్న గణనాథులు

● మంథనిలో విగ్రహాల తయారీ
● ఆకట్టుకుంటున్న పలు నమూనాలు





మంథని: ఆది దేవుడి అందాలకు కళాకారులు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న శ్రీ గణపతి నవరాత్రోత్సవాల్లో పూజలు అందుకునేందుకు మంథనిలో భారీగా విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. స్థానిక గాంధీచౌక్‌లో రాజస్థాన్‌కు చెందిన రతన్ సోలంకి ఆరు నెలలుగా 400 విగ్రహాలను తయారు చేశాడు. చిన్న సైజ్ నుంచి మొదలు కొని భారీ విగ్రహాల వరకు వివిధ ఆకృతుల్లో గణపతులను అందంగా తీర్చిదిద్దుతున్నాడు.

ఇప్పటికే వందలాది విగ్రహాల తయారీ పూర్తి కాగా వాటికి పేయింటింగ్ వేస్తున్నారు. స్థానిక గాంధీచౌక్, బ్రిడ్జి సమీపంలోని జగ్జీవన్‌చౌక్, పాత పెట్రోల్ పంపు సమీపంలో మూడు చోట్ల అమ్మకానికి పెట్టారు. ఈ కుటుంబం గత నాలుగేళ్లగా మంథని విగ్రహాలను తయారు చేస్తోంది. మట్టి విగ్రహాల ఏర్పాటుపై ప్రచారం జరుగుతున్నప్పటికీ కూడళ్లలో నెలకొల్పేందుకు వీరు తయారు చేసిన విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. రూ. 500లు మొదలు కొని రూ. 15,000 వరకు వివిధ ఆకృతుల్లో గణపతి విగ్రహాలు అమ్మకానికి సిద్ధమవుతున్నాయి.

అమ్ముడు పోకుంటే నష్టమే..

రతన్‌సొల్లంకి, విగ్రహాల తయారీదారుడు



కుటుంబ సభ్యులతో ఏడాదంతా కష్టపడి విగ్రహాలను తయారు చేస్తు న్నాం. అమ్ముడు పోకుంటే ఆర్థికంగా నష్టమే మిగులుతుంది. మంథనిలో గత సంవత్సరం విగ్రహాల అమ్మకానికి మంచి స్పందన లభించింది. ఈ సంవత్సరం కూడా అలాగే ఉంటుందని ఆశిస్తున్నాం. భక్తులకు విగ్రహాలు నచ్చే విధంగా రూపు దిద్దడానికి చాలా కష్టపడుతున్నాం.

ఆరు నెలలే పని దొరుకుతుంది..

కనుకుదేవి, కళాకారిణి



ఏడాదిలో ఆరు నెలలు మాత్రమే చేతి నిండా పని లభిస్తుంది. ఇందు కోసం రాజస్థాన్ నుంచి వచ్చి ఏటా ఇక్కడ విగ్రహాలను తయారు చేస్తున్నాం. ఈ ప్రాంతంలో విగ్రహాలకు ప్రజల నుంచి మంచి స్పందన ఉంది. మా పని తీరును ఆదరిస్తున్నారు. గణపతి విగ్రహాల తయారీ చూసి దుర్గామాత విగ్రహాల తయారీకి అడ్వాన్స్ ఇవ్వడం సంతోషంగా ఉంది.

ప్రతి మొక్కను కాపాడేందుకు చర్యలు



మొక్కలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

కమాన్‌పూర్ : మూడో విడత హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను కాపాడేందుకు చర్యలు చేపడుతున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి రహెమాన్ అన్నారు. మంగళవారం మండలంలోని పెంచికల్‌పేట, పేరపల్లి, కమాన్‌పూర్, నాగారంలలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఆయన వెంట పీపీవో కె రవిందర్, ఏపీవో రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతి, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఐఎస్ఎల్ చెక్కుల పంపిణీ

కమాన్‌పూర్ : గుండారంలో మంగళవారం 12 మంది వ్యక్తిగత మరుగుదొడ్ల లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 12వేల చొప్పున 2.64లక్షల రూపాయల చెక్కులను ఎంపీడీవో రాజు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల గట్టయ్య, ఎంపీటీసీ అనురాధ తదితరులున్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

కమాన్‌పూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన హరితహారంలో ఇంటికో మొక్కనాటి పర్యావరణాన్ని కాపాడాలని సర్పంచ్ కొంతం సత్యనారాయణ అన్నారు. మంగళవారం కమాన్‌పూర్ పంచాయతీ కార్యాలయం వద్ద మామిడి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఖలీమొద్దీన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై

కమాన్‌పూర్ : వినాయక చవితి, బక్రీద్ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై మధుసూదన్ రావ్ అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం హిందూ, ముస్లిం సోదరులతో పాటు ఉత్సవ కమిటీలు, మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. రాత్రి వేళ వినాయక మండపాల వద్ద నిర్వాహకులు అందుబాటులో ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా మైక్ సౌండ్స్‌లను ఉపయోగించకూడదన్నారు. నిమజ్జనాన్ని సాయంత్రం 7 గంటలలోపు పూర్తిచేయాలని సూచించారు. సర్పంచ్‌లు, ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు ఏఎస్సై సహదేవ్‌సింగ్ పాల్గొన్నారు.

డీజీఎం(పర్సనల్)కు ఆత్మీయ సన్మానం

మంథని(రామగిరి): ఆర్జీ-3 డివిజన్‌లో పనిచేసి కొత్తగూడెం ఏరియాకు బదిలీపై వెళ్తున్న ధార సోలోమన్‌రాజ్‌కు మంగళవారం పర్సనల్ అధికారులు ఆత్మీయ సన్మానం చేశారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పర్సనల్, ఏటీబీ సెల్‌కు చెందిన అధికారులు డీజీఎం(పర్సనల్)కు శాలువ, పూలదండలతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పర్సనల్ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ పోతేదార్ శ్రీనివాస్, సీనియర్ పీవో మారుతీ, దేవాదాస్, సంక్షేమాధికారులు నాగేశ్వర్‌రావు,సునీల్ ప్రసాద్, మురళీ, హరీష్, ఆర్.లక్ష్మన్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ముత్తారం: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎంపీపీ అత్తె చంద్రమౌళి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో అడవి శ్రీరాంపూర్ చెందిన దామ గోపి రూ.10వేలు, ఎస్ ఓదెలు, రూ.15 వేలు, పోతుపెద్ది రాధమ్మ రూ.16 వేలు, పెండ్యాల సమ్మక్క రూ.23వేలు, నూనేటి లక్ష్మీ రూ.5వేల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భూపెల్లి మొగిళి, శ్రీనివాస్, పెయ్యల కుమార్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పెన్షన్ విద్రోహ దినం పోస్టర్ ఆవిష్కరణ

ముత్తారం: నూతన పెన్షన్ పథకం రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం పోరాట కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న అన్ని జిల్లా కేంద్రాలలో కలెక్టరెట్ల ఎదుట ధర్నా, సామూహిక సెలవు పోస్టర్‌ను లక్కారంలోని పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అక్కపాక రాజమౌళి, రవికుమార్, నాగరాజు, రాజిరెడ్డి, సతీష్, విజయ్, ఈశ్వర్, రవిందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బిట్టుపల్లి వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

మంథనిరూరల్: మండలంలోని బిట్టుపల్లి మర్రివాగు వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద మంగళవారం సాయంత్రం పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా పక్కన ఏర్పాటు చేసిన రహదారిపై ఐదు రోజుల క్రితం ఏపీ29 యూ 1615 నెంబర్ గల ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. దానిని తొలగించే ప్రయత్నంలో పెద్ద క్రేయిన్ సహాయంతో పనులు మొదలు పెట్టారు. ట్యాంకర్ రోడ్డు పైకి రావడంతో మూడు గంటల సేపు మంథని-కాటారం ప్రధాన రహదారిపై నాలుగు కిలో మీటర్ల మేర రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



బోల్తాపడిన ట్యాంకర్‌ను తీస్తున్న క్రేన్

బ్రాస్‌బ్యాండ్ వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని వినతి

కమాన్‌పూర్ : బ్రాస్‌బ్యాండ్ వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ప్రధాన కూడళ్లలో ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ రాజమణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఇ.రాజయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ సాహెబ్ హుసేన్‌లు మాట్లాడుతూ బ్రాస్ బ్యాండ్ కళాకారులకు ఏడాదికాలంలో కనీసం 90రోజుల పనికూడా దొరకక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, బ్రాస్‌బ్యాండ్ వృత్తిదారులను కళాకారులుగా గుర్తించి ఉచితబీమా, ఈఎస్ఐ, బ్యాండ్‌ల కొనుగోలు కోసం సబ్సిడీ రుణాలు, 50సంవత్సరాలు నిండిన వృత్తిదారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పులిపాక బొంద్యాలు, కమాన్‌పూర్, జి.స్వామి, టి.శ్రీనివాస్, పొయిల ఓదెలు, శ్రీనివాస్, నారాయణ, కొమురయ్య, లక్ష్మణ్, మెండయ్య, దుర్గయ్య తదితరులున్నారు.

టీకాలు తప్పని సరిగా వేయించాలి

కమాన్‌పూర్ : ఎంఆర్‌టీ టీకాలతో తట్టు, రుబెల్లా వ్యాధులను నివారించవచ్చని, తల్లిదండ్రులు తప్పని సరిగా టీకాలు వేయించాలని ప్రాథమిక వైద్యాధికారి డా.రజిని అన్నారు. మంగళవారం మండలంలోని గుండారం యూపీఎస్ పాఠశాలలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ఎంఆర్‌టీ టీకాతో తట్టు, రుబెల్లా వ్యాధులను నివారించవచ్చని ఈ టీకాలపై కొందరు తల్లి దండ్రుల్లో అపోహలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీలత, దయామని, ఆశావర్కర్లు పాల్గొన్నారు .

ఇంటర్వ్యూ



పిల్లలకు టీకాలు వేయించాలి

డాక్టర్ శంకరాదేవి, గద్దలపల్లి పీహెచ్‌సీ

ఎంఆర్ టీకాల ప్రక్రియ ఎలా కొనసాగుతోంది..?

మండలంలో ఎంఆర్ టీకాల ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు చిన్నారులకు 17 వేల మందికి టీకాలు వేయాలనే లక్ష్యంతో వైద్య సిబ్బంది పని చేస్తున్నారు.

టీకా ప్రణాళిక ఏవిధంగా తయారు చేసుకున్నారు..?

మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాల్లోని విద్యార్థులకు మొదటి రెండు వారాలు, పట్టణంలో మరో రెండు వారాలు టీకాలు వేయడానికి ప్రణాళిక ఏర్పాటు చేసుకున్నాం. గ్రామాల్లో, పట్టణాల్లో మిగిలి పోయిన చిన్నారులకు టీకాలు వేస్తాం.

టీకా వలన ఏలాంటి ప్రయోజనం కల్గుతోంది..?

తట్టు టీకా వలన ఊపిరితిత్తులు, మెదడు ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉంటుంది. రుబెలా వలన అంగవైకల్యం కాకుండా ఉంటుంది. టీకా వేసుకోవడం వలన చిన్నారులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

- మంథని రూరల్

దీన్‌దయాల్ ఉపాధ్యాయ శతజయంతి

కోల్‌సిటీటౌన్: జనసంఘ్ నాయకుడు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ శత జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం బీజేపీ మహిళా మోర్చ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు మాతంగి రేణుక, జిల్లా ప్రధానకార్యదర్శి నేరెడుగొమ్మ కిరణ్మయి, మహిళా మోర్చ కార్పొరేషన్ అధ్యక్షుడు దాసరి భవాని, బీజేపీ నాయకులు మామిడి రాజేష్, మారం వెంకటేష్, సందీప్, కళాశాల ప్రిన్సిపల్ మాధవి, ఉపాధ్యాయులు రాజిరెడ్డి ఉన్నారు.

ఆరునెలల్లో ప్రతి ఇంటికి తాగునీరు

● ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ

యైటింక్లయిన్‌కాలనీ: ఆరునెలల్లోపు రామగుండం నియోజకవర్గ పరిధిలోని ప్రతిఇంటికి నిరంతరాయంగా తాగునీరు సరఫరా చేస్తామని ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ పేర్కొన్నారు. కాలనీకి తాగునీటి సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుండడంతో నేరుగా స్థానికులను కలిసి సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం 42వ డివిజన్‌లో స్థానిక ప్రజలతో సోమారపు సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.

కాలనీకి సరఫరా అవుతున్న పైప్‌లైన్ పగలడం, లీకేజీల కారణంగా నీటి సరఫరాకు పలుమార్లు ఆటంకాలు ఏర్పడినట్లు సోమారపు సత్యనారాయణ తెలిపారు. కార్పొరేషన్‌లో నీటిసరఫరాకు అమృత్‌పథకం కింద 96 కోట్లతో పనులకు టెండర్లు పూర్తయ్యాయని, వెంటనే పనులను ప్రారంభించి 6నెలల్లోపు 45వేల ఇళ్లకు నిరంతరాయంగా తాగునీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. కొత్తగా మూడు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను నిర్మించనున్నట్లు ఆర్టీసీ చైర్మన్ తెలిపారు.


మాట్లాడుతున్న సోమారపు సత్యనారాయణ

కోట్లాది రూపాయలు వెచ్చించి నీటిసరఫరాకు కృషి చేస్తున్నందున ప్రతి ఒక్కరు నల్లా కనక్షన్లు తీసుకోవాలని సూచించారు. 45వేల ఇళ్లకు కొత్త కనక్షన్లు, మీటర్లు బిగించేలా ఏర్పాట్లు చేసినట్లు సోమారపు తెలిపారు.

ఎల్లంపల్లి వద్ద 110కోట్లతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం చివరి దశలో ఉన్నదని, రామగుండం వద్ద రిజర్వాయర్ పనులు త్వరలోనే పూర్తవుతాయని వీటిద్వారా రామగుండం నియోజకవర్గంతో పాటు కాకుండా పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాలకు ఎల్లంపల్లి నీరు అందనున్నదని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు తాగునీటి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపుతామని సత్యనారాయణ పేర్కొన్నారు. ఈసమావేశంలో మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, డిప్యూటీ మేయర్ సాగంటి శంకర్, కార్పొరేటర్లు స్టాలిన్‌గౌడ్, కిషన్‌రెడ్డి, రవినాయక్, సత్యప్రసాద్, కోడాటి ప్రవీణ్, సమ్మయ్య, అధికారులు మల్లికార్జున్, మహేందర్, జమీల్‌లు పాల్గొన్నారు.

తట్టు, రుబెల్లా టీకాలు

కోల్‌సిటీటౌన్: రామగుండం కార్పొరేషన్ పరిధిలో తట్టు, రుబెల్లా టీకాల పంపిణీ కొనసాగుతున్నది. మంగళవారం గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లోని ఆపిల్ కిడ్స్ స్కూల్‌లో విద్యార్థులకు తట్టు, రుబెల్లా టీకాలు ఇచ్చారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విద్యార్థులకు టీకాలు వేశారు. 23వ డివిజన్‌లోని ఫైవింక్లయిన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తట్టు, రుబెల్లా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది సునీతా లక్ష్మి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో లోపాలు లేకుండా చూడండి

కోల్‌సిటీ: గణేష్ ఉత్సవాలకు, నిమజ్జనానికి ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం రామగుండం కమిషనర్ జాన్‌శామ్‌సన్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు వెన్నం రాంచందర్, ఆరెల్లి జలేందర్‌గౌడ్, లడ్డు రమేష్, నా ర గోని వెంకన్న, అడిగొప్పుల రాజు, మేడగోని రవీందర్, జిమ్ సమ్మన్న, సత్తన్న, పెరుక శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

'ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా'

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీ కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం నిలబెట్టుకున్నాని శాప్ మాజీ చైర్మన్ రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. కేశోరాంలో ఈ నెల 24న జరుగనున్న పర్మినెంట్ కార్మిక సంఘం గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా మంగళవారం గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ తాను ఏనాడు సాధ్యం కాని హామీలు ఇవ్వలేదని, ఇచ్చిన హామీలనే పూర్తిస్థాయిలో కార్మికుల సంక్షేమం కోసం పని చేశానని పేర్కొన్నారు. అధ్యక్ష అభ్యర్థి బయ్యపు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అభ్యర్థి ముల్కాళ్ల కొమరయ్య, సర్పంచ్‌లు పర్వతిని శ్రీనివాస్, ముక్కెర శ్రీనివాస్, గంగాధర రమేష్, నాయకులు రాజయ్య, గద్దాల నగేష్, రాజమౌళి, గంధం ఆంజనేయులు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

అమృత్ పథకం పురోగతిపై ఎమ్మెల్యే సమీక్షా

కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్‌కు మంజూరైన అమృత్ పథకం పురోగతిపై రామగుండం ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ మంగళవారం కార్పొరేషన్, ప్రజారోగ్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గౌతమినగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టుల్లో రూ.46వేల కోట్లతో తెలంగాణలోని ప్రతి ఇంటికి నీరందించేందుకు మిషన్ భగీరథ తొలి ప్రాధాన్యతలో ఉందని, రామగుండంలో కూడా పనులు పూర్తయ్యాయని తెలిపారు. 50ఎంఎల్‌డీల నీరు అందుబాటులోకి వచ్చే సమయానికి అవసరమున్న చోట్ల పైప్ లైన్ పొడగింపు, తప్పనిసరిగా పైప్‌లైన్ మార్చాలిన చోట కొత్త లైన్లు వేయాలని సూచించారు. వీలైనంత త్వరగా 24గంటల మంచినీటి సరఫరా అమలు చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కొత్త పైప్‌లైన్లు నిర్మించిన అల్లూరు, మారేడుపాకతో పాటు గతంలో 24గంటలు సరఫరా చేసిన మున్సిపల్ ట్యాంకు పరిధిలోని లక్ష్మీనగర్ ప్రాంతంలో 24గంటల నీటి సరఫరా అమలు చేయడానికి ప్రణాళికబద్ధంగా ముందుకుపోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎస్ఈ మల్లికార్జునుడు, ఈఈ మహేందర్, పబ్లిక్ హెల్త్ ఈఈ భద్రయ్య, డీఈ సంపత్‌రావు, ఏఈ మౌనిక పాల్గొన్నారు.

'నిమజ్జనం చేసే తేదీ ముందే తెలుపాలి'

అంతర్గాం: నిమజ్జనం చేసే తేదీ, సమయాలను ముందుగా తెలుపాలని, రామగుండం పట్టణం, అంతర్గాం మండలంలోని గ్రామాల్లో గణపతి నవరాత్రుల నిర్వహణ కమిటీలకు నిబంధనలతో కూడిన ప్రకటనను రామగుండం ఎస్ఐ రవీందర్, అంతర్గాం ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి ప్రకటించారు. విగ్రహాలు ప్రతిష్ఠించే నిర్వాహకులు వారి పరిధి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని గోదావరిఖని ఏసీపీ నుంచి మైక్ పర్మిషన్ పొందాలని కోరారు. విగ్రహ మండపాల వద్ద తప్పనిసరిగా కాపలాదారులను నియమించాలని, మండపాల వద్ద తప్పనిసరిగా భక్తి పాటలు వేయాలని, విద్యుత్ కనెక్షన్ విద్యుత్ సంస్థ అధికారి నుంచి పర్మిషన్ పొందాలని, డీజేలను వాడవద్దని నిబంధనలు పాటించని పక్షంలో చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రవీందర్, ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుంటే చర్యలు

● కనీస వేతనాల బోర్డు చైర్మన్ గోవర్ధన్

కోల్‌సిటీ: ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వ జీఓల ప్రకారం కనీస వేతనాలు ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటామని కేంద్ర కనీస వేతనాల అమలు కమిటీ చైర్మన్ ఆవుల గోవర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం, కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో కనీస వేతనాలు అమలు చేయడం లేదని తమకు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడంతో పాటు బ్యాంకు వేతనాలు చెల్లించాలని, పే స్లిప్పులు ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి సింగిల్ కోడ్ విధానంలో అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. నెల వేతనం బోనస్‌గా చెల్లించాలన్నారు. అక్టోబర్ నుంచి జీఓ ప్రకారం వేతనాలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం పేర్కొంది. అనంతరం గోవర్ధన్ కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడారు. ఎల్కలపల్లిగేట్ ప్రాంతంలో కాంట్రాక్టు కార్మికుల కోసం కాంట్రాక్టర్లు వేసిన షెడ్‌లను పరిశీలించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ జీఎం తాపర్, విజయ్‌కుమార్‌బంగార్, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


కార్మికులు నివాసముంటున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గోవర్ధన్

ఆయన వెంట బీఎంఎస్ జాతీయ నాయకుడు భట్టాచార్య, రాష్ట్ర కార్యదర్శి పులి రాజిరెడ్డి, నాయకులు కంది శ్రీనివాస్, ఏనుగు రవీందర్‌రెడ్డి ఉన్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ విజ్ఞప్తి చేసింది.

కొనసాగుతున్న క్యారమ్స్ పోటీలు

జ్యోతినగర్: ఎన్‌టీపీసీ రిక్రియేషన్ క్లబ్‌లో రాష్ట్ర సీనియర్ క్యారమ్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. మంగళవారం జరిగిన మొదటి, రెండవ రౌండ్ మ్యాచ్‌ల్లో సీడెడ్ క్రీడాకారులు తమ ప్రత్యర్థులపై సునాయాసంగా విజయాలు సాధించారు. అలాగే స్థానిక, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అన్ సీడెడ్ క్రీడాకారులు సైతం రాణించి తదుపరి రౌండ్‌ల్లోకి ప్రవేశించారు. మంగళవారం మహిళా విభాగంలో పోటీలు ప్రారంభమయ్యాయి. బుధ, గురువారాల్లో క్యారమ్స్ సెమీ ఫైనల్స్ స్థాయి మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. శుక్రవారం మూడు విభాగాల్లో ఫైనల్స్ పోటీలు జరుగుతాయి. ఈ పోటీలను టౌన్‌షిప్‌కు చెందిన క్రీడాభిమానులు ఆసక్తిగా తిలకించారు.

బ్యాంకుల సమ్మె విజయవంతం

కళ్యాణ్‌నగర్: బ్యాంక్ విలీనాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన ఒక రోజు సమ్మె గోదావరిఖనిలో విజయవంతం అయ్యింది. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మెలో రామగుండం పరిధిలోని సుమారు 20 బ్యాంకుల సిబ్బంది పాల్గొని గోదావరిఖని చౌరస్తాలో నిరసన చేపట్టారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మె చేపట్టినట్లు పేర్కొన్నారు. బ్యాంకుల సమ్మెతో గోదావరిఖనిలో లావాదేవీలు నిలిచిపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నిరసనలో దెబ్బట సతీష్, దామెరకుంట సంతోష్, సుధాకర్, ఓదయ్య, రంజిత్, నరేష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులు హెచ్‌ఎంఎస్‌కు అండగా నిలవాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న హెచ్‌ఎంఎస్‌కు యువకార్మికులు అండగా నిలవాల్సిన అవసరం ఉన్నదనియూ నియన్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో వకీల్‌పల్లె గనికి చెందిన పలువురు యువకార్మికులు హెచ్‌ఎంఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈకార్యక్రమంలో నాయకులు దశరథం, వీ రస్వామి, అయాజ్, పినకాశి మొగిలి, రవీందర్, లక్ష్మయ్య, యాకయ్యలు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

లక్ష్మీనగర్: వినాయక నవరాత్రులను పురస్కరించుకుని మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని ఆర్‌టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మట్టి విగ్రహాల వినియోగంపై ముద్రించిన కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. టీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ ముప్పిడి సత్యప్రసాద్, కార్పొరేటర్ వడ్లూరి రవి, నాయకులు బక్కి కిషన్, తిరుపతిగౌడ్, బిక్షపతి, రత్నాకర్, సతీష్, అజీజ్, నారాయణ, సమ్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

లక్ష్మీనగర్: రామగుండం టాటా మ్యాజిక్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బస్టాండ్ అడ్డా అధ్యక్షులుగా రేణికుంట రాజయ్య ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా సోమారపు అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మారెపల్లి విద్యాసాగర్, ఉపాధ్యక్షులుగా ఎం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సదానందం, కోశాధికారులుగా గట్టయ్య, జంపన్న, ప్రచార కార్యదర్శిగా లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీగా రాజయ్యతో పాటు ముగ్గురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

'ఖని'లో ఏఐఎస్‌ఎఫ్ నిరసన

కోల్‌సిటీటౌన్: కేజీటూ పీజీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేస్తామన్న కేసీఆర్ అమలు చేయకుండా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖనిలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా నగర కార్యదర్శి సుద్దాల అనురాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నగర అధ్యక్షుడు పవన్, భూసారపు రాజ్‌కుమార్, కళ్యాణ్, బాపు, రామ్, రఘు, రాజు పాల్గొన్నారు.

'విద్యుత్ అనుమతి తీసుకోవాలి'

లక్ష్మీనగర్: గణపతి నవరాత్రులు పురస్కరించుకుని ఏర్పాటు చేయనున్న గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరాకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని గోదావరిఖని సబ్ డివిజన్ ట్రాన్స్ ఏడీఈ ఎస్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు.

నేడు బీఎస్పీ జిల్లా స్థాయి సమావేశం

సుల్తానాబాద్ : బీఎస్పీ జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కాంపల్లి బాబు తెలిపారు. పెద్దపల్లి ఆర్అండ్‌బీ ఐబీ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించనున్న సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి వరికిల్ల మల్లేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదుర్ల మల్లేశం హాజరవుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంపై చర్చించడం జరుగుతుందని, పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని ముఖ్య కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

ధర్మారం : రజకార్ల పాలన నుంచి విముక్తి లభించిన సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నం అంజయ్య డిమాండ్ చేశారు.. 1948 సెప్టెంబర్ 17న స్వేచ్ఛాయుతమైన స్వాతంత్ర్యం వచ్చిందని, అదే రోజున అధికారికంగా ప్రతి వాడలో ఉత్సవాలు జరపాలన్నారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని మంగళవారం ధర్మారంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని బీజేపీ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. ప్రభుత్వ అధికారికంగా నిర్వహించని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో అన్ని జిల్లా, మండల, డివిజన్ కేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లో జాతీయ పతాకాలను ఎరగవేసి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అందులో భగంగానే సెప్టెంబర్ 17న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో 30వేల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సభకు కేంద్ర మంత్రులు హాజరవుతారన్నారు. గతంలో సెప్టెంబర్ 17న అధికారికంగా ఉత్సవాలు జరపాలని ఉద్యమనేతగా కేసీఆర్ హెచ్చరించారని ఆయన గుర్తు చేశారు. అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ సెప్టెంబర్ 17ను విస్మరించి పాలిస్తున్నారని ఆయన ఆరోపించారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన

సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ధర్మారంలో బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించార. మార్కెట్ కార్యాలయం రోడ్ నుంచి పాత బస్టాండ్, ప్రధాన చౌరస్తా మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొద్దిసేపు ఆందోళన కేస్తూ నినాదాలు చేశారు. అనంతరం సెప్టెంబర్17ను అధికారికంగా నిర్వహించాలని మెమోరండంను తహసీల్దార్ కెవై ప్రసాద్‌కు అందజేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుజ్జుల రాజనరేందర్‌రెడ్డి, అధికార ప్రతినిధి గాగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు దొనికేని తిరుపతిగౌడ్, ఉపాధ్యక్షుడు బత్తుల కుమారస్వామి, నాయకులు మేడవేని శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, సుమన్ పాల్గొన్నారు.

24 నుంచి ఇంటింటికి సీపీఐ

ఓదెల : మండలంలోని గ్రామాల్లో ఈనెల 24 నుంచి ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకుడు తాళ్లపల్లి లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ మాదాన నారాయణ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. గ్రామ స్థాయి, మండల, జిల్లా స్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కారించే దశలో ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. మండల కేంద్రంలో ప్రారంభించి మండల వ్యాప్తంగా విడతల వారీగా నిర్వహిస్తామన్నారు.

మండల స్థాయి క్రీడల ఎంపిక పోటీలు ప్రారంభం

జూలపల్లి: మండల స్థాయి క్రీడల ఎంపిక పోటీలను మంగళవారం మండల కేంద్రంలోని బాలుర పాఠశాల ఆవరణలో సర్పంచ్ కొంజర్ల వెంకటయ్య ప్రారంభించారు. 14 నుంచి 17 సంవత్సరాల లోపు బాలికలకు ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్ క్రీడల పోటీలను నిర్వహించారు. బుధవారం బాలురకు సైతం ఇదే క్రీడలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు ఎంఈఓ గంగాధర్ రెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఉదయ్‌కుమార్, పీఈటీలు పాల్గొన్నారు.

రేపు జాగృతి కవితాంజలి

సుల్తానాబాద్ : తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో గురువారం పెద్దపల్లిలో నిర్వహించే జాగృతి కవితాంజలి కార్యక్రమానికి కవులు పాల్గొనాలని జాగృతి నియోజకవర్గ కన్వీనర్ బండారి కమలాకర్ తెలిపారు. కవితాంజలికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం సుల్తానాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ కవితాంజలిలో తెలంగాణకు సంబంధించిన అంశాలుంటాయన్నారు. టీజేడబ్ల్యుఎఫ్ మహిళ నేతలు మొలుగూరి స్వప్న, శ్రీజ, నాయకులు వేల్పుల సాయిరాం, అనిల్, సాయి కిషోర్, అనిల్, కాంత్రి పాల్గొన్నారు.

సినిమా గ్రేడ్

సంగీత -నేనే రాజు...నేనే మంత్రి

శ్రీనివాస- జయజానకినాయక

బ్యాంకుల సమ్మె విజయవంతం

ధర్మారం : బ్యాంకింగ్ రంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను నిరసిస్తూ మంగళవారం యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఇచ్చిన దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ధర్మారంలో బ్యాంకుల సమ్మె విజయవంతమైంది. ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో బ్యాంకింగ్ లావాదేవీలు నిలిచిపోయాయి. బ్యాంకుల సమ్మె విషయం తెలియకపోవడంతో వినియోగదారులు బ్యాంకుల వద్దకు వచ్చి పడిగాపులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్యాంకులో పనిచేసే ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు.



మూసి ఉన్న ధర్మారం ఎస్‌బీఐ బ్రాంచ్

ఎలిగేడులో..

ఎలిగేడు : దేశవ్యాప్త బంద్‌లో భాగంగా మండల కేంద్రంతోపాటు సుల్తాన్‌పూర్ ఎస్‌బీఐ శాఖలు మంగళవారం బంద్ పాటించాయి. ఉద్యోగుల సమ్మెబాట మూలంగా బ్యాంకులకు తాళాలు తీయలేదు. ప్రభుత్వ రంగం బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీనం, నష్టాల్లో ఉన్న బ్యాంకుల మూసివేత, మొండి బకాయిల రద్దుకు వ్యతిరేకంగా విధులకు గైర్హాజరయ్యారు. బ్యాంకుల బంద్ మూలంగా ఖాతాదారులు, వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. కొంతమంది ఖాతాదారులు బ్యాంకులు బంద్‌లో పాల్గొంటున్నాయని తెలియక వచ్చి తిరిగి వెళ్లిపోయారు. దీంతో కొంతమంది ఇబ్బంది పడ్డారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్ : బ్యాంక్ ఉద్యోగుల సమ్మె పిలుపులో భాగంగా మండలంలోని అన్ని శాఖలు బంద్ పాటించాయి. దేశవ్యాప్త సమ్మె పిలుపు మేరకు బ్యాంకు ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొన్నారు. దీంతో సుల్తానాబాద్‌లోని అన్ని శాఖలతో పాటు, కనుకుల శాఖ కూడా బంద్ పాటించాయి. బంద్ గురించి తెలియక చాలా మంది వినియోగదారులు బ్యాంకు వరకు వచ్చి వెళ్లిపోయారు.

ఎంపీపీపై ఆరోపణలు తగవు

కాల్వశ్రీరాంపూర్ : ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్‌పై తప్పుడు ఆరోపణలు తగవని జడ్పీటీసీ లంక సదయ్య అన్నారు. ఆయన మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.మంగటపేటలో జరిగిన అత్యాచార యత్నం విషయంలో ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ 5 లక్షలు తీసుకున్నట్లు ఆరోపణలు చేస్తున్నారన్నారన్నారు. సర్పంచులు జక్కె రవీందర్‌గౌడ్, శంకర్‌గౌడ్, అనిషాకలిమొద్దీన్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో...

సుల్తానాబాద్: బీసీ నాయకుడిగా ఎదుగుతున్న కాల్వశ్రీరాంపూర్ ఎంపీపీ సారయ్యగౌడ్‌పై కుట్రపూరితంగా ఆరోపణలు చేస్తున్నారని టీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఖండించారు.

ఎలిగేడులో..

ఎలిగేడు : సారయ్యగౌడ్‌పై ఆరోపణలు అర్థరహితమని వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడుగుల మహేందర్, దుర్గయ్య అన్నారు. సర్పంచ్ పర్శరాములుగౌడ్, రాజు పాల్గొన్నారు.

ఓదెలలో..

ఓదెల : సారయ్యపై నాయకులు ఆరోపణలు చేయడం సబబుకాదని గ్రామ గౌడసంఘం ఖండించారు. మండల కేంద్రంలో గౌడసంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. శ్రీనివాస్, సమ్మయ్య పాల్గొన్నారు.

జూలపల్లిలో..

జూలపల్లి: సారయ్యగౌడ్‌పై కొందరు అగ్రకుల నాయకులు చేస్తున్న కుట్రలను బీసీ యువజన సంఘాల జిల్లా కార్యదర్శి మెరుగు రమేష్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడారు. రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మీజిల్స్, రూబెల్లా టీకాలపై అవగాహన

ధర్మారం : విద్యార్థులకు అంటువ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం చేపట్టిన మీజిల్స్, రుబెల్లా టీకాలపై మంగళవారం స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సామ ఎల్లారెడ్డి, డాక్టర్ కె.శ్రీనివాస్, వెంకటేశ్ మాట్లాడుతూ వాతావరణంలో ఏర్పడిర వైరస్ వల్ల పిల్లలకు అంటువ్యాధులు సోకుతున్నాయన్నారు. వీటి నివారణకు మీజిల్స్, రుబెల్లా కలిపి ఒకే టీకా నివారణ వ్యాక్సిన్ వేస్తున్నారని పేర్కొన్నారు. పిల్లలు ఈ టీకాను వేయించుకోవాలని సూచించారు.

అనంతరం లయన్స్‌క్లబ్, వైద్య శాఖ సంయుక్తంగా బాలికలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సామ ఎల్లారెడ్డి, కార్యదర్శి తలమక్కి రవీందర్‌శెట్టి, హెచ్‌ఈవో రాజిరెడ్డి, కోశాధికారి ఎలగందుల అశోక్, పీఆర్‌వో కోరుకంటి స్వామి, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కనుకుల శివాలయంలో బిల్వాపత్రార్చన

సుల్తానాబాద్ : శ్రావణమాసం ముగింపును పురస్కరించుకుని మండలంలోని కనుకుల శివాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊటూరి శంకరశర్మ ఆధ్వర్యంలోని పూజారులు ఆలయం ఆవరణలో గ్రామస్థులతో పూజలు చేయించారు. గర్భగుడిలో బిల్వపత్రాలతో అర్చన చేశారు. లక్ష బిల్వార్చన అభిషేకాల అనంతరం అన్నపూజ కూడా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రౌతు బాపన్న, ఎంపీటీసీ మైలారం నారాయణ, సదాశివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను సందర్శించిన అధికారి

ధర్మారం : మండలంలోని మేడారం ఎస్సీ హాస్టల్‌ను మంగళవారం జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి మిట్ట మొగిలయ్య సందర్శించారు. ఉదయం 8గంటలకు హాస్టల్‌కు చేరుకొని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనశాలను పరిశీలించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా హాస్టల్ ఆవరణలో నాటిన మొక్కలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్‌లో నిర్వహణ గురించి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సంపత్‌ను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని, ప్రభుత్వం విడుదల చేసిన మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆయన పేర్కొన్నారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా నవీన్



కాల్వశ్రీరాంపూర్ : పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా మండలంలోని మడిపల్లి గ్రామపరిధిలోని ఆశన్నపల్లెలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కడారి నవీన్, ప్రధాన కార్యదర్శిగా ముంజాల హరికృష్ణగౌడ్‌ను ఎన్నుకున్నట్లు ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు మోత్కూరి నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా అసోసియేట్ అధ్యక్షుడిగా కృష్ణమూర్తి, మహిళా కార్యవర్గ సభ్యులుగా మమత, స్వర్ణ, ప్రవీణ, రజిత, సునీతను ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తా

జూలపల్లి : ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలోని ఇంటర్మీడియట్ డేస్కాలర్ విద్యార్థులకు ఈనెల 24 నుంచి సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ తెలిపారు. మండలంలోని పెద్దాపూర్ ఆదర్శ పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ కాట రవీందర్‌గౌడ్, ఉపసర్పంచ్ అంజయ్య, ప్రిన్సిపాల్ మురళీధర్ పాల్గొన్నారు.

అతి తేమ శాతం వల్లే పత్తి పంటకు నష్టం

ఓదెల: ఇటీవల కురుస్తున్న ముసురు వర్షాల వల్ల పత్తి పంటలో అధికంగా తేమశాతం పెరగడం వల్లనే పత్తి పంటలు దెబ్బతిన్నాయని జమ్మికుంట కేవీకే సైంటిస్ట్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని గూడెం, ఇందుర్తి, గుంపుల శివారులో దెబ్బతిన్న పత్తి పంటలను మంగళవారం వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తి పంటలో పెరిగిన తేమ వల్ల మొక్కలకు పోషక పదార్థం అందలేదని, దీంతో మొక్కకు శ్వాస లేక వాడిపోయాయని తెలిపారు. రైతులు తేరుకోవాలన్నారు. ముందుగా పంటను రక్షించుకునే పద్ధతులను ఉపయోగించుకొని, చర్యలు చేపట్టలని కోరారు. 19.19.19 మందును లీటర్ నీటికి 10 గ్రాముల మందును కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఏఈఓలు మౌనిక, సంతోష్, కిరణ్ పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి

ఓదెల : మండలంలోని జీలకుంట, గుంపుల, గూడెం, ఇందుర్తిలో పత్తిపంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కాసర్ల తిరుపతిరెడ్డి కోరారు. మండలంలో పత్తిపంటలు దెబ్బతిన్న గ్రామాల్లో కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు కాసర్ల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పత్తి పంటలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణానికి తట్టుకోలేని పత్తి విత్తనాలను రైతులకు ఇవ్వడం వల్లనే అధికస్థాయిలో పత్తికి తెగులు సోకిందన్నారు. సంబంధిత కంపెనీ యాజమాన్యమే రైతులకు పరిహారాన్ని భరించాలని, లేకుంటే వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు తాళ్లపల్లి వెంకటేశ్, పులి కొమురయ్య, బొమ్మక నరేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చౌక్ తొలగించవద్దని నిరసన


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లి టౌన్ : హైదరాబాద్ ఇందిరాచౌక్ పార్క్ వద్ద ధర్నా చౌక్ తొలగించవద్దని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ ఈర్ల కొమురయ్య మాట్లాడుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఎన్ని ఆందోళనలు చేపట్టినా సీఎం కేసీఆర్ పట్టు వదలకుండా మొండిగా వ్యవహరిస్తుడన్నారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో ఢిల్లీ వెళ్లి ధర్నా చౌక్‌ను ఎత్తివేయవద్దని కేంద్ర హోం మత్రిని కలువనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మంథెన నర్సింగ్, పడాల కొమురయ్య, కడార్ల శ్రీనివాస్, జయదేవ్, తాజ్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

పెద్దపల్లి టౌన్ : తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు పల్లె సదానందం ఆరోపించారు. సాదాబైనామాల ప్రక్రియకు రైతుల నుంచి డబ్బులు వసూళు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అనంతరం ఆయన మాట్లాడుతూ సాదాబైనామాలు, పట్టాదారు పాసుపుస్తకాల కోసం ఏడువేల మంది అర్జీ పెట్టుకుంటే కేవలం 900 మాత్రమే అప్రువల్ చేశారని తెలిపారు. శిలువేరు ఓదెలు, పుట్ట రవి, మౌటం నర్సింగం, ఫహీం, స్వతంత్ర కుమార్, అక్కెపల్లి క్రాంతి, పర్శ సమ్మయ్య, శివంగారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ స్ఫూర్తిదాయకం


వాల్ ఆఫ్ క్రైండ్‌నెస్ గోడను ప్రారంభిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

పెద్దపల్లి కల్చరల్ : ప్రతి వ్యక్తి సమాజంపై దృష్టి సారించి చేసే సామాజిక సేవ స్ఫూర్తిదాయకంగా ఉంటుందని ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రినిటి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన వాల్ ఆఫ్ క్రైండ్‌నెస్ ప్రోగ్రాంను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. మీ వద్ద ఉన్న ఉపయోగం లేని వస్తువులు ఈ గోడకు తగిలించి, మీకు ఉపయోపగపడే వస్తువులను తీసుకెళ్లండనే నినాదంతో కార్యక్రమాన్ని రూపకల్పన చేయడం ఆనందించదగ్గ విషయమన్నారు. ప్రిన్సిపాళ్లు నీతారెడ్డి, రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుగుతున్నందుకే ఆరోపణలు

పెద్దపల్లి టౌన్ : బీసీ వర్గానికి చెందిన కాల్వశ్రీరాంపూర్ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ రాజకీయాల్లో ఎదుగుదలను చూసి ఓర్వలేకనే కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని టీఆర్ఎస్ నాయకులు సయ్యద్ మస్రత్, కుక్క కనుకరాజ్ పేర్కొన్నారు. స్థానిక ఐబీ అతిథిగహంలో వీరు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు పంచాయితీల్లో పాల్గొనడం సహజమని, అందులో 5 లక్ష డబ్బులు పట్టించాడని ప్రచారం చేయడం సబబు కాదన్నారు. వీడియోలను సోషల్ మీడియా ద్వారా తమ నాయకునిపై బురదజల్లుతున్నారన్నారు. సాక్ష్యాధారాలుంటే ఎక్కడైనా వేదిక ఏర్పాటు చేసి నిరూపించాలని డిమాండ్ చేశారు. కీర్తి రాజయ్య, ఈశ్వర్‌గౌడ్, శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అందని వేతనాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రెండు మాసాలుగా ఉపాధిహామీ కూలీలు కూలి డబ్బులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు తవ్విన గుంతలకు ఇంతవరకు కూలీలకు బిల్లులు రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 8 కోట్ల రూపాయల వరకు కూలి బిల్లులు రావాల్సి ఉంది. ఈ విషయమై కూలీలు మండల కార్యాలయాలు, సంబంధిత అధికారులు, సిబ్బంది చుట్టూ తిరుగుతున్నారు. ఆదివారం కాల్వశ్రీరాంపూర్‌లో సామాజిక తనిఖీలో భాగంగా ఉపాధిహామీ కూలీలతో సంబంధిత అధికారులు కూలీలతో గ్రామసభ నిర్వహించగా, వారు ఆ సభను బహిష్కరించారు. ఏడాది కాలంగా తాము చేసిన పనులకు గాను కూలి సొమ్ము రావడం లేదంటూ గ్రామసభను బహిష్కరించి ధర్నా చేశారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుస్తోంది.

జిల్లాలో 2,56,281 మంది కూలీలు ఉండగా, 1,11,627 మంది కూలీలు జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉన్న కూలీలకు 36 లక్షల పని దినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు 20 లక్షల 10 వేల 32 పని దినాలు కల్పించారు. కాలువల్లో చెత్త, పూడిక తీయడం, రోడ్లు వేయడం, చెరువుల్లో పూడిక తీయడం, మరుగుదొడ్ల నిర్మాణాలకు గుంతలు తవ్వడం, హరితహారంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం, మొక్కలకు నీళ్లు పోయడం, తదితర పనులు చేపట్టారు. ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీలకు గరిష్టంగా 194 రూపాయలుగా నిర్ణయించింది. అయితే సగటున కూలీలకు 136 రూపాయల వరకు వస్తోంది. వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్లుతున్నారు.

ఈ సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురియక పోవడంతో ప్రాజెక్టుల్లోకి నీళ్లు రాలేదు. ఈ కారణంగా జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టు భూములు సాగుకు నోచుకోలేదు. దీంతో కూలీలకు వ్యవసాయ పనులు తగ్గాయి. దీంతో ప్రత్యామ్నాయంగా వారు ఉపాధిహామీ పనులకు వెళుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 36 కోట్ల 74 లక్షల రూపాయలు వెచ్చించారు. ఇందులో కూలీలకు పని కల్పించినందుకు వేతనాల కింద 28 లక్షల 29 వేల రూపాయలు వేతనాలు చెల్లించాల్సి ఉంది. మెటీరియల్ కంపోనెంట్ కింద 6 కోట్ల 79 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంది. రెండు మాసాల నుంచి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాక పోవడం వల్లనే ఉపాధి కూలీలకు బిల్లులు రావడం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 14 మండలాలకు చెందిన కూలీలకు కూలి డబ్బులు చెల్లించాల్సి ఉంది. అయితే ఏ మండలానికి ఎన్ని కూలి డబ్బులు రావాలనే విషయం అధికారులు చెప్పలేక పోతున్నారు. రాష్ట్ర కార్యాలయం నుంచే నెట్ బ్యాంకింగ్ ద్వారా నేరుగా ఉపాధిహామీ కూలీల బ్యాంకు ఖాతాలు, పోస్టాఫీస్ ఖాతాలకు జమ చేస్తున్నారు. రెండు మాసాల నుంచి ఎలాంటి బిల్లులు రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధిహామీ కూలి డబ్బులను విడుదల చేసి తమను ఆదుకోవాలని కూలీలు కోరుతున్నారు.

ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి

కాల్వశ్రీరాంపూర్ : ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ పీడీ ప్రేమ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఈజీఎస్ 9వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ 2015-16 సంవత్సరానికిగాను మండలంలోని ఆయా గ్రామాల్లో రూ.2,50,78,008 పనులు జరిగాయన్నారు. రూ.2,24,88,219 కూలీలు పని చేయగా రూ.25,89,789 మెటీరియల్ పనులు జరిగాయన్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లోని ఫీల్డ్‌అసిస్టెంట్లకు కూలీల డబ్బుల విషయంలో జరిగిన అవకతవకల వలన రూ.28,444 జరిమానా విధించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

కూలీల రభస..

కాల్వశ్రీరాంపూర్‌లోని పాండవుల గుట్టకు పెట్టిన చెట్లకు వాచ్, అండ్ వాటర్ కింద పనిచేసిన సుమారు 20 మంది కూలీలు తమకు డబ్బులు చెల్లించడం లేదని రభస చేశారు. స్పందించిన పీడీ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ సారయ్యగౌడ్, జడ్పీటీసీ సదయ్య, ఏపీడీ కృష్ణ, ఏఈ మల్లేశం, ఏపీఓ మంజుల పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు సామరస్యంగా నిర్వహించాలి

కలెక్టరేట్ : జిల్లాలో గణేశ్ ఉత్సవాలను సామరస్యంగా నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గణేశ్ ఉత్సవాలపై ఇన్‌చార్జి కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ నవరాత్రులకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మంచినీరు, విద్యుత్, పారిశుధ్యం, మెడికల్, లైటింగ్ వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఇబ్బంది కల్గించే సౌండ్స్‌ను ఏర్పాటు చేయరాదని గణేశ్ ఉత్సవ కమిటీకి సూచించారు. ప్రభుత్వం ఎకో ఫ్రెండ్లీగా ఉండే మట్టి వినాయకులను ప్రోత్సహిస్తుందన్నారు. ప్రజలు కూడా మట్టి ప్రతిమలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తక్కువ ఎత్తులో ఉన్న కేబుల్ విద్యుత్ వైర్లను తొలగించి ఎక్కువ ఎత్తులో వేయాలన్నాఉ. గణేశ్ నవరాత్రుల సందర్భంగా అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వినాయక నిమజ్జనం సమయంలో విగ్రహాలు సీరియల్ నెంబర్‌గా రూట్ మ్యాప్ కేటాయించాలన్నారు. నిమజ్జన ప్రదేశాలల్లో గజ్జ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, బారీ క్రేన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. చౌరస్తాలో లైట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ శాఖ ఈ నవరాత్రుల సందర్భంగా భద్రత పెంచాలని, అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 2న బక్రీద్ ఉన్నందున, వాటికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు, మతపెద్దలు సామరస్యంగా పండగలను జరుపుకోవాలని, ఘర్షణ వాతావరణం లేకుండా చూడాలన్నారు. ఇన్‌చార్జి డీఆర్‌ఓ అశోక్‌కుమార్, ఆర్డీఓ పద్మయ్య, పెద్దపల్లి సీఐ మహేశ్, అధికారులు పాల్గొన్నారు.

కార్మికులు ఈపీఎఫ్, ఈఎస్‌ఐలో సభ్యులుగా చేరాలి

పెద్దపల్లి టౌన్ : అసంఘటిత కార్మికులు ఈపీఎఫ్, ఈఎస్‌ఐలలో సభ్యులుగా చేరితే అన్ని విధాల లబ్ధి పొందవచ్చని జాతీయ కనీస వేతన బోర్డు చైర్మెన్ ఆవుల గోవర్ధన్ సూచించారు. మంగళవారం పెద్దపల్లికి వచ్చిన గోవర్ధన్ రైల్వే, ఎఫ్‌సీఐ హామాలీలతో సమావేశమయ్యారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గూడ్స్ ఫ్లాట్‌ఫాంలో వర్షం పడితే మురుగు నీరు చేరి పందులు దొర్లి దుర్వాసన లేపడంతో పని చేయలేక పోతున్నామని చైర్మెన్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన ఫ్లాట్ ఫాం తిరిగి పరిశీలించారు. ఫ్లాట్ ఫాం నిర్మాణంతో పాటు షెడ్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు అసంఘటిత కార్మికుల కోసం ఎన్నో సంక్షేమ పథకాల ప్రవేశపెట్టాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఈపీఎఫ్, ఈఎస్‌ఐలలో సభ్యత్వం పొందితే ప్రమాదాలు జరిగినా, అనారోగ్యానికి గురైనా పైసా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చన్నారు. అలాగే 58 ఏళ్లు నిండిన తరువాత పింఛన్ వర్తిస్తుందన్నారు. సభ్యులుగా చేరినవారికి యూనిక్ నంబర్ కేటాయిస్తారని, ఎంత మంది కాంట్రాక్టర్లు మారినా మీరే నేరుగా ఈపీఎఫ్ చెల్లించుకోవచ్చన్నారు. కార్మికరంగంలో ప్రధాని నరేంద్రమోదీ ఎన్నో చట్టాలు తీసుకువచ్చారని వివరించారు. ఆడవారి ప్రసూతి సెలవులను 12 వారాల నుంచి 26 వారాలకు పెంచారన్నారు. భవిష్యనిధి నుంచి రుణ సౌకర్యం కల్పించే ఏర్పాటు చేశారన్నారు. 44 రకాల కార్మిక చట్టాలను కేవలం 4 చట్టాల్లోనే చేర్చి కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. స్త్రీ, పురుష తేడా లేకుండా అందరికి సమాన వేతనం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల వేతనాల్లో అక్రమాలు జరగకుండా బ్యాంకుల ద్వారా చెల్లించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్మికులు సమ్మెలు చేసే కాలం చెల్లిపోనుందన్నారు. కార్యక్రమంలో దుగ్యాల ప్రదీప్‌రావు, పులి రాజిరెడ్డి, కడారి శ్రీనివాస్, కంది శ్రీనివాస్ ,రవీందర్‌రెడ్డి, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌కుమార్, రాంసింగ్ శిలారపు పర్వతాలు, దాడి సంతోష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల గోవర్ధన్

జీపీ ఉద్యోగులకు న్యాయం చేయాలి

కలెక్టరేట్ : ప్రభుత్వం గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ కారోబార్, బిల్ కలెక్టర్ల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నకంటి వెంకటేశ్‌కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాసిపేట అశోక్, కల్వల రాజమొగిళి, సంటి శ్రీనివాస్, సాగర్, రాజయ్య, రమేష్, గౌసోద్దీన్, గట్టయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలి

కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో అనాథ వృద్ధులకు ప్రభుత్వ ఆశ్రమం ఏర్పాటు చేయాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ మంగళవారం ఇన్‌చార్జి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.. వినతిపత్రం ఇచ్చిన వారిలో బూతగడ్డ సంపత్, చంద్రగిరి రవి, తిర్రి రవీందర్‌గడ్, నక్క సతీష్, బూషనవేన సమ్మయ్య తదితరులు ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు



	వెన్‌కాబ్	సుగుణ
ఫారం ధర	105.00	108.00
విత్‌స్కిన్	146.00	146.00
స్కిన్‌లెస్	170.00	176.00
బోన్‌లెస్	350.00	360.00

కోడిగుడ్ల ధరలు

రైతు ధర	(100)	340.00
రిటేల్	(100)	360.00

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

● 4.51 లక్షల బంగారు ఆభరణాలు, బైక్స్, సెల్‌ఫోన్స్ స్వాధీనం.. ● వివరాలు వెల్లడించిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం : తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతూ తప్పించుకుతిరుగుతున్న జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన రాత్రి కన్నపు దొంగ బొడసు మహేశ్ (24)ను చొప్పదండి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. దొంగిలించిన బంగారు ఆభరణాలు, బైక్‌లను విక్రయించేందుకు చొప్పదండికి వస్తున్నట్లు అందిన సమాచారం మేరకు చొప్పదండి సీఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు నిఘా పెట్టి అరెస్టు చేశారు. పట్టుబడిన దొంగ నుంచి 4.51 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, మూడు మోటార్ సైకిళ్ళు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులసమావేశంలో పోలీసు కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు.

బొడాసు మహేశ్ తల్లిని 2007లో అతని తండ్రి హత్యచేసి జైలుకు వెళ్లాడు. దీంతో మహేష్ నిజామాబాద్ జిల్లాలోని భీంగల్‌కు వెళ్లి బంధువుల ఇంట్లో ఆశ్రయం పొందాడు. అక్కడే 8వ తరగతివరకు చదువుకున్నాడు. 2016 నుంచి దొంగతనాలు చేయడంప్రారంభించాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి అర్ధరాత్రి చోరీకి పాల్పడేవాడు. అవి అమ్ముకుని వాటితో జల్సాలకు అలవాటు పడ్డాడు. కరీంనగర్ జిల్లాలో ఏడు, జగిత్యాలలో నాలుగు, నిజామాబాద్‌లో మూడు దొంగతనాలకు పాల్పడ్డాడు. మహేశ్ అరెస్టు ద్వారా 14 దొంగతనాలు ఛేదించామని సీపీ విబి కమలాసన్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ వి తిరుపతి ఆధ్వర్యంలో నిందితుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన చొప్పదండి సీఐ సీహెచ్ రమేశ్, ఎస్ఐ చంద్రశేఖర్, క్రైం బృందంలోని కానిస్టేబుళ్లు లక్ష్మీపతి, కోటి, శ్రీనివాస్, సంతోష్, ప్రదీప్‌లకు కమిషనర్ అభినందిస్తూ నగదు రివార్డులను అందజేశారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీపీ విబి కమలాసన్‌రెడ్డి

● ఇళ్లకు తాళం వేసి వెళితే పోలీసులకు సమాచారం అందించాలి...

ఇళ్లకు తాళం వేసి ఇతర ఊళ్లకు వెళ్లే సందర్భంలో ఇంటి యజమానులు పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి కోరారు. ఊళ్లకు వెళ్లేటప్పుడు ఇంట్లో విలువైన వస్తువులు, లేకుండా చూసుకోవాలన్నారు. ఇతర ఊళ్లకు వెళ్లిన సందర్భాల్లో బంధువులు, నమ్మకస్తులను ఇంట్లో ఉంచాలని సూచించారు.

● సీసీ కెమెరాల ఏర్పాటు కోసం 1.5 లక్షల విరాళం..

చొప్పదండి మండలం ఆర్నకొండ గ్రామంలో నేను సైతం కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సర్పంచ్ గంటల అనిత రమణారెడ్డి, ఎంపీటీసీ కోమళ్ల రాజేశ్వరి రాజేశంలు మంగళవారం కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డికి 1.50 లక్షల విరాళాన్ని చెక్కు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ వి తిరుపతి, చొప్పదండి సీఐ సీహెచ్ రమేశ్, ఎస్ఐ చంద్రశేఖర్, వార్డు సభ్యులు ఎనగందుల మల్లికార్జున్, యువజన సంఘం ప్రతినిధి విద్యాసాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● కరుడు గట్టిన నేరస్తులపై పీడీ యాక్టు అమలు..

తరచూ నేరాలకు పాల్పడే కరుడు గట్టిన నేరస్తులపై పీడీ యాక్టు అమలు చేస్తామని పోలీస్‌కమిషనర్ అన్నారు. ఇప్పటికే అనేక మంది దొంగలపై పీడీ యాక్టును అమలు చేశామన్నారు. పీడీయాక్టు అమలు వల్ల దోపిడీ, దొంగతనాలు నియంత్రణలోకి వచ్చాయని తెలిపారు. కిరాయిదారులకు ఇళ్లకు అద్దె విషయంలో ఇంటి యజమానులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కిరాయిదారుల వివరాలను తెలియజేస్తూ పోలీసులకు దరఖాస్తు అందజేసినట్లయితే సదరు వ్యక్తులు దేశంలో ఎక్కడైనా నేరాలకు పాల్పడ్డారా లేదా తెలియజేస్తామన్నారు. ఈ సేవలు ఉచితంగా అందజేస్తామన్నారు. పోలీసు శాఖ ఉచితంగా అందజేస్తున్న ఈసేవలను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

138 మంది మత్స్యకార్మికుల పై కేసు నమోదు

కమాన్‌పూర్ : మండల మత్స్యపారిశ్రామిక సంఘం మాజీ అధ్యక్షుడు గడప కృష్ణమూర్తితో పాటు 137 మంది కమిటీ సభ్యులపై సెక్షన్ 447, 500, 504, 506, ఆర్‌డబ్లు34, 156(3) కేసు నమోదైనట్లు ఎస్సై మధుసూదన్‌రావ్ మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల కమాన్‌పూర్ మండల పెద్దచెరువులోని శిఖం భూమిని గ్రామానికి చెందిన పిల్లి చంద్రశేఖర్ ఆక్రమించుకున్నాడని, అందులో చేపల చెరువు ఏర్పాటు చేసుకుంటున్నాడని కమాన్‌పూర్ మండల మత్స్యపారిశ్రామిక సంఘం మాజీ అధ్యక్షుడితో పాటు 137 మంది కమిటీ సభ్యులు పిల్లి చంద్రశేకర్ పట్టాభూమిలో ఏర్పాటు చేసుకున్న చెరువు కట్టలను ధ్వంసం చేసి దాడికి పాల్పడ్డారు. దీనిపై పిల్లి చంద్రశేకర్ కోర్టు నుంచి ఫిర్యాదుచేయగా కోర్టు విచారణలో చంద్రశేకర్ ఏలాంటి ఆక్రమణకు పాల్పడలేదని తేలింది.

దీంతో మాజీ అధ్యక్షుడు గడప కృష్టమూర్తితో పాటు 137 మంది సభ్యులపై కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ అధికారుల తనిఖీలు

● మండలంలో 65కేసులు నమోదు

సైదాపూర్: మండలంలోని అన్ని గ్రామాలలో విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు మంగళవారం పోలు టూ పోల్ సర్వే చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ చౌర్యం చేస్తున్న వారికి ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారుల తనిఖీలలో 42విద్యుత్ చౌర్యందారులు దొరకగా ఆపరేషన్ అధికారులకు 23 పట్టుకున్నారు. మండలంలో 65మంది విద్యుత్ చౌర్యం కేసులను నమోదు చేసినట్లు ఏఈ రాములు తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మల్యాల : సోదరితో వివాహేతర సంబంధం అంటగట్టడంతో మనస్థాపం చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్యాల ఎస్సై నీలం రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్యాల మండల కేంద్రానికి చెందిన గడ్డం జలంధర్(30) అనే యువకుని చెల్లెలికి కొన్ని రోజుల క్రితం విడాకులు కావడంతో ఇంటి వద్దే ఉంటోంది. దీంతో అతడి ఇంటి సమీపంలోని కొందరు సోదరితో వివాహేతర సంబంధం ఉందంటూ అపవాదు మోపారు.



మృతి చెందిన జలంధర్

ఆగ్రహించిన జలంధర్ వారం రోజుల క్రితం వారితో గొడవపడ్డాడు. ఇది పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. అక్కడ మందలించి వదిలివేయగా, తనపై మోపిన నిందను తలుచుకుంటూనే తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్లిన జలంధర్ సంఘటనను గుర్తు తెచ్చుకుని తట్టుకోలేకపోయాడు. జీవితంపై విరక్తి చెంది తమ పశువుల కొట్టంలో ఉరి వేసుకున్నాడు. తండ్రి నర్సింగ్ వెళ్లి చూసేవరకు ఉరి వేసుకుని కనిపించాడు. తమ కొడుకు మృతికి సిరికొండ మల్లేశం, లక్ష్మి, వినయ్‌లే కారణమని, వారు నింద మోపడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు మృతుడి తండ్రి నర్సింగ్ ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు.

కరీంనగర్ బాలసదన్ నుంచి ఇద్దరు బాలికల అదృశ్యం

ఆర్మూర్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు

కరీంనగర్ క్రైం : కరీంనగర్ బాలసదన్ గృహం నుంచి ఇద్దరు బాలికలు అదృశ్యమయ్యారు. కరీంనగర్‌లోని క్రిస్టియన్ కాలనీలో ఉన్న బాలసదన్‌లో ఆశ్రయం పొందుతున్న 17 ఏళ్లు, 13 ఏళ్లు వయస్సు ఉన్న ఇద్దరు బాలికలు సోమవారం అర్ధరాత్రి అదృశ్యమైనట్లు బాలసదన్ బాధ్యులు గుర్తించారు. ఇటీవల చైల్డ్ వెల్ఫేర్ సొసైటి అధికారులు అనాధగా ఉన్న 17 ఏళ్ల బాలికను చేరదీసి బాలసదన్‌లో చేర్పించారు. 20 రోజుల కిందట కరీంనగర్‌లోని ఒక వ్యభిచార గృహంపై దాడి చేసిన పోలీసులకు 13 ఏళ్ల వయస్సు న్న ఒక బాలిక పట్టుబడింది. ఆమె సంరక్షణ కోసం పోలీసులు బాలసదన్‌లో చేర్పించారు. ఈ ఇద్దరు కలిసి సోమవారం అర్ధరాత్రి బాలసదన్ నుంచి అదృశ్యమవటం అనుమానాలు తావిస్తోంది. బాలసదన్‌కు ప్రహరీగోడ, గేట్‌కు తాళం వేసి ఉండగా ఆయా, ఇతర పర్యవేక్షకుల కళ్లుగప్పి బాలికలు ఏలా అదృశ్యమయ్యారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాలసదన్ ఉగ్యోగుల నిర్లక్ష్యం మూలంగానే ఇద్దరు బాలికలు అదృశ్యమైనట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ మేరకు బాలసదన్ నుంచి బాలికలు అదృశ్యమయ్యారని కరీంనగర్ రెండవ ఠాణాలో బాలసదన్ ఇన్‌చార్జి సూపరిటెండెంట్ సంతోషి మంగళవారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సిఐ మహేష్‌గౌడ్ తెలిపారు. బాలికలు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఉన్నట్లు గుర్తించామని, వారిని అదుపులోకి తీసుకుని కరీంనగర్‌కు తీసుకువస్తున్నామని సిఐ తెలిపారు.

మతిస్థిమితం లేని బాలిక ఆత్మహత్య

కొడిమ్యాల : మతిస్తిమితం సరిగా లేక ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఓ బాలిక మృతి చెందిన సంఘటన కొడిమ్యాలలో మంగళవారం జరిగింది. కొడిమ్యాల ఎస్సై కిరణ్‌కుమార్ కథనం మేరకు కొడిమ్యాల గ్రామానికి చెందిన కొత్తూరి మరియ(17) ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకుంది. మంటలకు తాళలేక కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి చూసే సరికి అప్పటికే కాలిపోయింది. 12 ఏళ్ల క్రితం మృతురాలి తల్లి మృతి చెందింది. అప్పటి నుంచి మరియను అమ్మమ్మ రామంచ హన్మవ్వ పోషిస్తున్నది. మరియ మేడిపెల్లి మండలం కల్లూరు మాడల్ కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతోంది. నెల రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో ఆమెను కొడిమ్యాలకు అమ్మమ్మ తీసుకవచ్చింది. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

మెట్‌పల్లి: మండలంలోని ఆరపేట శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చల్ల సోమయ్య(60) అను వృద్ధుడు మృతి చెందినట్లు మెట్‌పల్లి ఎస్ఐ అశోక్ తెలిపారు. సిరిసిల్ల ప్రాంతంలోని సీర్లవంచ గ్రామానికి చెందిన చల్ల సోమయ్య కుటుంబం కొంతకాలంగా మెట్‌పల్లి మండలం ఆరపేట శివారులో గుడిసెలు వేసుకొని నివాసముంటోంది. మెట్‌పల్లిలో జ్యోతిష్యం చెప్పుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆరపేట శివారులో జాతీయ రహదారిని దాటుతుండగా కోరుట్ల వైపు నుంచి మెట్‌పల్లి వైపు వెళుతున్న ఓ కారు అతివేగంతో అదుపు తప్పి వచ్చి సోమయ్యను ఢీకొంది. సంఘటనలో సోమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన సోమయ్య

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

హుజూరాబాద్ రూరల్: మండలంలోని జూపాక గ్రామ పంచాయతీ పరిధిలోని బొత్తలపల్లి గ్రామానికి చెందిన రూపిరెడ్డి ప్రదీప్‌రెడ్డి (40) అనే రైతు అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు టౌన్ సీఐ వీవీ రమణామూర్తి మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ప్రదీప్‌రెడ్డి అప్పుల బాధ తట్టుకోలేక తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వద్ద అప్పులు ఎవరెవరికి ఇవ్వాలో తెలియజేసే లేఖను ప్రదీప్‌రెడ్డి రాశారు. అయితే సూసైడ్‌నోట్ ఆధారంగా అప్పులతోనే మృతి చెందినట్లు భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడికి భార్య అనిత, ఇద్దరు కుమార్తెలున్నారు. జూపాక గ్రామానికి చెందిన బక్కారెడ్డి-సరోజన దంపతుల కుమారుడైన ప్రదీప్‌రెడ్డి బొత్తలపల్లి గ్రామంలోని సుంకరి ప్రభాకర్‌రెడ్డి ఇంటికి 20 సంవత్సరాల క్రితం ఇల్లరికం వెళ్లాడు. మృతుడి మామ ప్రభాకర్‌రెడ్డి అప్పుల బాధతోనే ప్రదీప్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ప్రదీప్‌రెడ్డి మృతదేహం

చెక్ బౌన్స్ కేసులో ఆరునెలల జైలు శిక్ష

జగిత్యాల టౌన్ : చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఆరునెలల జైలు శిక్షతో పాటు రూ. 1,75,000 జరిమానా విదిస్తూ జగిత్యాల రెండవ అదనపు మెజిస్ట్రేట్ సతీష్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన కొట్టాల తిరుపతి రెడ్డి తన మిత్రుడైన ఏనుగు లక్ష్మారెడ్డికి 2014 సంవత్సరంలో లక్ష 20వేల రూపాయలను అవసరం నిమిత్తం ఇచ్చాడు. ఆరునెలల తర్వాత రూ. 1,33,500గాను లక్ష్మారెడ్డి చెక్కును తిరుపతి రెడ్డికి అందజేశాడు. బ్యాంక్ అకౌంట్‌లో నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయింది. దీంతో తిరుపతిరెడ్డి తరపున న్యాయవాది మధన్‌మోహన్ కోర్టులో కేసు దాఖలు చేశారు. మంగళవారం జడ్జి సతీష్ కుమార్ కేసును పరిశీలించి నేరం రుజువు కావడంతో లక్ష్మారెడ్డికి ఆరునెలల జైలు శిక్షతో పాటు రూ. 1,75,000 జరిమానా విదిస్తూ తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఇల్లంతకుంట : మండలంలోని కందికట్కూర్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బిగుళ్ల ప్రేమ్‌సాగర్ (25) అనే యువకుడు మంగళవారం గాయపడ్డాడు. ప్రేమ్‌సాగర్ ఆర్టీసీలో కాంట్రాక్ట్ పద్ధతిలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ప్రేమ్‌సాగర్ తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ లక్ష్మారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాళేశ్వరం తెలంగాణకు వరప్రదాయిని

● గోదావరికి జలకళ తీసుకవచ్చే ప్రాజెక్టు ● పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభలో అన్ని వర్గాల డిమాండ్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్: 'కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని.. గోదావరి నదిని సజీవంగా ఉంచడంతోపాటు వట్టిపోయిన ప్రాజెక్టులన్నింటికి జలకళ తీసుకువచ్చి రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాలన్నింటిని సస్యశ్యామలం చేసే జీవధార.. 36 లక్షల ఎకరాలకు సాగునీరందించి రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చే ఈ ప్రాజెక్టును వీలైనంత త్వరలో నిర్మించాలి.. ఎన్ని అడ్డంకులొచ్చిన ఈ ప్రాజెక్టును నిర్మించి తీరాలి'.. అని ప్రజలు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ నేపథ్యంలో పర్యావరణంపై పడనున్న ప్రభావంపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించడానికి ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలు ముక్తకంఠంతో ఈ ప్రాజెక్టును నిర్మించాల్సిందేనని డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ జిల్లా రేకుర్తిలోని రాజశ్రీ గార్డెన్‌లో కాలుష్య నియంత్రణ మండలి, తెలంగాణ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ రవిదాస్, కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఎన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ప్రాణహిత నదిలో తుమ్మడిహెట్టి వద్ద 44 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. దానికి బదులు గోదావరిలో ప్రాణహిత కలిసిన తర్వాత కాళేశ్వరం త్రివేణి సంగమ కేంద్రానికి దిగువన మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల గ్రామాల వద్ద వరుస బ్యారేజీలను నిర్మించి రివర్స్ పంపింగ్ ద్వారా రోజుకు రెండు టీఎంసీల చొప్పున 90 రోజులపాటు 180 టీఎంసీల నీటిని తరలించే అవకాశం ఉన్న ఈ ప్రాజెక్టు రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తుందని ప్రజలు అభిప్రాయపడ్డారు. తెలంగాణలోని 13 జిల్లాలకు సాగు, తాగునీటితో పాటు పరిశ్రమలకు అవసరమైన నీరు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా సమకూరుతుందని ప్రజలు అభిప్రాయపడ్డారు. వీలైనంత త్వరలో ఈ ప్రాజెక్టును నిర్మించి శ్రీరాంసాగర్, తదితర వట్టిపోయిన ప్రాజెక్టుల ఆయకట్టును స్థిరీకరించి జలకళ తీసుకరావాలని ప్రజలు డిమాండ్ చేశారు. ప్రాజెక్టుకు అడ్డు తగులుతున్న వారు ఇకనైనా ఆ ప్రయత్నాలు మానుకోవాలని వారు సూచించారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు, చొప్పదండి ఎమ్మెల్యే బొడిగె శోభ, జడ్పీటీసీ వీర్ల కవిత

తెలంగాణ జిల్లాలకు ఒకప్పుడు వరప్రదాయినిగా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పది సంవత్సరాలుగా నిండకుండా వట్టిపోతుండడంతో ఈ ప్రాంతంలో వలసలు పెరిగాయి. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని ఎగువ జిల్లాలకు తరలించడంతోపాటు శ్రీరాంసాగర్‌ను కూడా నింపవచ్చని, దీంతో 18.50 లక్షల కొత్త ఆయకట్టుతోపాటు 18 లక్షల పాత ఆయకట్టుకు సాగునీరందించవచ్చని ప్రజలు అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దుబాయి, బొంబాయి, తదితర ప్రాంతాలకు వలసవెళ్లినవారు తిరిగివచ్చే అవకాశాలుంటాయని ప్రజలు అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు నిర్మాణంతో 120 కిలోమీటర్ల నిడివిలో నీరు నిల్వ ఉండి గోదావరి సజీవంగా ఉంటుందని, మత్స్య సంపద పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ నేతలు ఈ ప్రాజెక్టుకు అడ్డుపడకుండా ఇప్పటికైనా అభివృద్ధికి సహకరించాలని ప్రజలు కోరారు.

● నిరసన ధ్వనులు..

కాళేశ్వరం ప్రాజెక్టు పర్యావరణ ప్రభావంపై ఈ నెల 22 నుంచి 26 వరకు జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణ చట్ట విరుద్ధంగా జరుగుతున్నదని, దీన్ని వాయిదా వేయాలని తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కలెక్టర్‌ను కోరాయి. ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టక ముందే ప్రజాభిప్రాయాలను సేకరించాల్సి ఉన్నదని, ఒకవైపు ప్రాజెక్టు నిర్మాణ పనులు కొనసాగిస్తూ మరోవైపు ప్రజాభిప్రాయ సేకరణ అనడం మొక్కుబడి వ్యవహారమేనని వారు అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులవుతున్న వారి హక్కులను హరించి వేస్తున్నారన్నారు. ముంపునకు గురవుతున్న భూములకు ఇప్పటికి ధర నిర్ణయించకుండానే, సేకరణ పూర్తి కాకుండానే పనులు కొనసాగిస్తున్నారని వారు నిరసించారు. నిర్వాసితుల హక్కులను కాపాడడానికి పర్యావరణ అభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని వారు డిమాండ్ చేశారు.

● ప్రాజెక్టు నిర్మాణం వల్ల కలిగే సామాజిక, ఆర్థిక ప్రభావాల పూర్తి స్థాయి నివేదికను తెలుగులో ప్రచురించి ప్రజలను చైతన్యవంతులను చేసిన తర్వాతనే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని సీపీఐ, అనుబంధ సంఘాలు డిమాండ్ చేశాయి.

● కాళేశ్వరం ప్రాజెక్టు, పర్యావరణ విషయంలో ప్రజాభిప్రాయ సేకరణకు ముందు పాటించాల్సిన విధి విధానాలు సరిగా లేనందున వాయిదా వేయాలని కాంగ్రెస్ పార్టీ కలెక్టర్‌ను కోరింది. ప్రాజెక్టులకు అనుమతులు లేకుండా పనులు మొదలు పెట్టడం, టెండర్లు, కాంట్రాక్టులు ఇవ్వడం, పర్యావరణ అనుమతుల ప్రక్రియను ప్రహసనంగా మార్చడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతులను, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే పాలనావేదికలను నిర్వీర్యం చేస్తుందని కాంగ్రెస్ ఆరోపించింది.

సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్, మానకొండూర్ శాసనసభ్యుడు రసమయి బాలకిషన్, చొప్పదండి శాసనసభ్యురాలు బొడిగె శోభ, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజలు, రైతు సంఘాలు, సాగునీటి సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రులపై నమ్మకం పెరుగుతోంది

● పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ● మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి బీఎస్సీ నర్సింగ్ కళాశాల, మాతా, శిశు సంరక్షణ ఆసుపత్రికి శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి) : "నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అని పాటలు పాడుకునే రోజుల నుంచి నేను సర్కారు దవాఖానకే పోతా అని అంటున్నారని" కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని పురపాలక, ఐటీశాఖ మంత్రి కె తారకరామరావు స్పష్టం చేశారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం, ఐసీయూ, బ్లడ్ బ్యాంక్‌తోపాటు మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి, ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కళాశాలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డితో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు.

అనంతరం సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ వస్తే ఏం వస్తుందని అన్నవాళ్ల నోర్లు మూతపడేలా మూడేళ్లలో ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులను తెచ్చిందన్నారు. సిరిసిల్ల లాంటి కేంద్రాల్లో కూడా ఐసీయూ, బ్లడ్‌బ్యాంక్, డయాలసిస్ కేంద్రం, అత్యవసర పరిస్థితుల్లో అక్సిజన్ అందించడానికి వెంటిలేటర్లను కూడా ఏర్పాటు చేసుకున్నామన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా 40 కేంద్రాల్లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసి కిడ్నీ వ్యాధిగ్రస్థులకు సాంత్వన కల్పించామన్నారు. ప్రసూతికి వస్తే సురక్షితమైన డెలివరీ కోసం మూడు నెలల ముందు, తర్వాత విశ్రాంతి పొందేలా నెలకు 2 వేల చొప్పున 12 వేలు ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఆడబిడ్డ పుడితే వెయ్యి అదనంగా ఇస్తున్నామన్నారు. ఆసుపత్రుల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి సిరిసిల్లలో రూ.50 కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు.

సిరిసిల్లలో మాతా శిశు సంరక్షణ కేంద్రం, 50 పడకలతో ఏర్పాటు కాబోతోందని, వచ్చే సంవత్సరం నుంచి కోర్సులు ప్రారంభమయ్యేలా నర్సింగ్ కళాశాల కూడా ఏర్పాటు అవుతోందని చెప్పారు. రోగులను ఇతర ప్రాంతాలకు పంపించకుండా ప్రత్యేక వైద్య నిపుణులు సేవలు అందించడానికి వీలుగా సిరిసిల్లలో మెడికల్ పీజీ, డిప్లమా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. డయాగ్నోస్టిక్ కేంద్రం, తెలంగాణ ఔషధ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, కలెక్టర్ కృష్ణ భాస్కర్, డీఆర్వో శ్యాంప్రసాద్‌లాల్, సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని, ఏఎంసీ చైర్మన్ జిందం చక్రపాణి, గ్రంథాలయ చైర్మన్ అకునూరి శంకరయ్య, జిల్లా వైద్యాధికారి డా రమేష్, మహిళా సంక్షేమ ఆర్గనైజర్ గుగులోతు రేణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ తవుటు కనకయ్య, జడ్పీటీసీలు ఆగయ్య, శరత్‌రావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ దార్నం లక్ష్మీనారాయణ, సెస్ వైస్‌చైర్మన్ లగిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మా అమ్మంటే ఇజ్జత్ పోయింది..

\- మంత్రి కేటీఆర్

మా అమ్మ ఈ మధ్య ఓ ఫంక్షన్ కోసం సిరిసిల్లకు వచ్చింది. చాలా రోజుల తర్వాత సిరిసిల్ల వెళ్లింది కదా అని మున్సిపల్ మంత్రిగా సిరిసిల్ల ఏట్లా ఉందని అమ్మను అడిగిన... 'రోడ్లు పెద్దగా అయినయి, పందులు గట్లనే ఉన్నాయని అంది'. ఇన్ని నిధులిచ్చినా ఆ మాటంటే ఇజ్జత్ పోయింది. మున్సిపల్‌లో పందులు తొలగించాలని ఆదేశించా. పందుల వల్ల పిల్లలకు అనేక ఇబ్బందులు వస్తాయి.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 7

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విందు వినోదాలు, వేడుకలకు ఖర్చులు అంచనాలు మించుతాయి. ఆరోగ్యం, ఆహార విషయాలపై శ్రద్ధ చూపించాలి. రిటైల్, హోటల్, వైద్య రంగాల వారికి వృత్తిపరంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతములతో ఉల్లాసంగా వేడుకల్లో పాల్గొంటారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. పెట్టుబడుల్లో నిదానం అవసరం. లాభిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

మిథునరాశి: (మే21-జూన్21): ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. రియల్ ఎస్టేట్, రిటైల్, గృహనిర్మాణ రంగాలు పట్టుదలతో లక్ష్యాలు సాధిస్తారు. కుటుంబ సభ్యుల వైఖరి ఆవేదన కలిగిస్తుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): సోదరీ సోదరులు, బంధుమిత్రులను కలుసుకుంటారు. ప్రయాణాలు, సమావేశాల్లో కొంత అసౌకర్యానికి గురవుతారు. ఒక సమాచారం కలవరపెడుతుంది. ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకుంటారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. పెట్టుబడుకు సంబంధించిన నిర్ణయాలు వాయిదా వేయండి. షాపింగ్‌లో వస్తువుల నాణ్యత గమనించండి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బృందకార్యక్రమాలు, వేడుకల్లో పాల్గొంటారు. వ్యక్తిగత అవసరాల కోసం ఖర్చు చేస్తారు. కీలక నిర్ణయాలు వాయిదా వేయండి. మీ నిర్ణయాలను సమీక్షించుకుంటారు. మనశ్శాంతి లోపిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): పూజలు, వేడుకలు, సంస్మరణల్లో పాల్గొంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. పెట్టుబడుల్లో నిదానం అవసరం. ప్రయాణాల్లో చికాకులు తప్పకపోవచ్చు. సినీ రాజకీయ రంగాలవారికి ప్రోత్సాహకరం.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. బృంద కార్యక్రమాల్లో అసౌకర్యానికి గురవుతారు. స్నేహితులు, ప్రియతముల కోసం ఖర్చులు అధికం.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ మర్యాదలకు భంగం కలిగే అవకాశంఉంది. కుటుంబ పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): సమావేశాలు, బృందకార్యక్రమాలు, వేడుకల్లో పాల్గొంటారు. ప్రయాణాలు,చర్చలు సత్ఫలితాలను ఇవ్వకపోవచ్చు. ఒక సమాచారం ఆందోళన కలిగిస్తుంది. న్యాయ,బోధన, కన్సల్టెన్సీ రంగాల వారికి శుభప్రదం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. మనసును ఏదో వెలితి వెంటాడుతుంది. పూజలు, వేడుకలు, సంస్మరణల్లో పాల్గొంటారు. క్రయవిక్రయాలలో నాణ్యత గమనించండి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో వేడుకలు, విందుల్లో పాల్గొంటారు. కొత్త పరిచయాలు లాభిస్తాయి. సాహస ప్రయత్నాలకు, పందాలకు అనుకూల సమయం కాదు. ఖర్చులు అంచనాలు మించుతాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

'సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు'

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని జీఎం కార్యాలయం అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని ఇన్‌చార్జీ జీఎం పీవీ.సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఉదయం 9గంటలకే అన్ని విభాగాల్లో స్వయంగా వెళ్ళి ఉద్యోగులు, అధికారుల హాజరు పరిశీలించారు, సమయ పాలనపై తెలుసుకున్నారు. ప్రతి ఉద్యోగి తప్పకుండా సమయ పాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలని కోరారు. ఆలస్యమైనప్పుడు తప్పకుండా సంబంధిత అధికారి అనుమతి తీసుకోవాలన్నారు.

ఏటేటా తగ్గుతున్న కార్మికులు

● 2012లో 63,429 మంది ఓటర్లు ● 2017 జూలై నాటికి 55,376

(ఆంధ్రజ్యోతి-మంచిర్యాల)

సింగరేణి కాలరీస్‌లో ఐదేళ్లలో ఓటర్ల సంఖ్య (కార్మికుల సంఖ్య) భారీగా తగ్గింది. 2012 జూన్ 28న జరిగిన గుర్తింపు ఎన్నికల్లో 63,429 మంది ఓటర్లు ఉండగా 2017, జూలై నాటికి 55,376కు పడిపోయింది. 2016-17 సంవత్సరాలలో 5,500 మంది కొత్తగా రిక్రూట్ కావడం వల్ల ఈ సంఖ్య అక్కడ ఉంది. మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలలో మొత్తం 55,376 మంది కార్మికులు 11 ఏరియాల్లో పని చేస్తున్నారు.

ఓటర్ల జాబితాను మరోసారి సరిచేసి ఈ నెల 30న డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, సింగరేణి ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంసుందర్ ప్రకటించనున్నారు.

ప్రతిసారి ఎన్నికలు ఆలస్యం

సింగరేణిలో ఇప్పటి వరకు ఐదుసార్లు ఎన్నికలు జరగగా మూడుసార్లు ఏఐటీయూసీ, ఒకసారి ఐఎన్‌టీయూసీ, మరోసారి టీబీజీకేఎస్‌లు విజయం సాధించాయి. 1998 సెప్టెంబర్ 14న జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించి రెండేళ్ల పాటు గుర్తింపు సంఘంగా ఉంది. తిరిగి 2000ల సంవత్సరం ఫిబ్రవరి 11న జరిగిన ఎన్నికల్లో విజయం సాధించింది. అప్పుడు యూనియన్ గుర్తింపు కాల పరిమితిని రెండు సంవత్సరాలే ఉంది. కాగా 2003 మే 9న జరిగిన గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. అప్పటికే గుర్తింపుసంఘం కాల పరిమితిని నాలుగు సంవత్సరాలకు పెంచారు. తిరిగి 2007 ఆగస్టు 10న జరిగిన ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించి నాలుగు సంవత్సరాలు అధికార సంఘంగా కొనసాగింది. 2012 జూన్ 28న జరిగిన ఎన్నికల్లో టీబీజీకేఎస్ విజయం సాధించింది.

సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు ప్రతిసారి అనుకున్న సమయానికి జరగడం లేదు. ప్రస్తుతం టీబీజీకేఎస్ జూన్ 2012 నుంచి అధికార సంఘంగా కొనసాగుతుండగా ఎన్నికలు 14 నెలలు ఆలస్యంగా జరుగుతున్నాయి. మరో వైపు మొదటిసారి ఐదు నెలలు, రెండోసారి మూడున్నర నెలలు, మూడోసారి మూడున్నర నెలలు, నాల్గవసారి 10 నెలలు ఆలస్యంగా ఎన్నికలు జరిగిన దాఖలాలున్నాయి.

'ట్రేడ్‌మెన్ల సమస్యల పరిష్కారానికి కృషి'


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత శేషయ్య

గోదావరిఖని: గుర్తింపు ఎన్నికల్లో గెలిచిన వెంటనే సింగరేణిలో పని చేస్తున్న ట్రేడ్స్‌మెన్లు, ఈపీ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి డీ శేషయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు వేల్పుల నారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక టీటీసీ కేంద్రంలో శిక్షణ పొందుతున్న ట్రేడ్స్‌మెన్, ఈపీ ఆపరేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేకసంవత్సరాలు పని చేసి అనారోగ్యరిత్యా అన్‌ఫిట్ అయిన ట్రేడ్స్‌మెన్‌లు, ఈపీ ఆపరేటర్లకు సుటబుల్ జాబు ఇవ్వకుండా వేతనాలు తగ్గించి జనరల్ మజ్దూర్లుగా ఇస్తున్నారని పేర్కొన్నారు. మైనింగ్ సిబ్బంది, ఓవర్‌మెన్, మైనింగ్ సర్దార్లను కూడా జనరల్ మజ్దూర్లుగా డీప్రమోట్ చేస్తున్నారని ఆరోపించారు. గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ వైఫల్యం చెందడం వల్ల ట్రేడ్స్‌మెన్లు నష్టపోతున్నారన్నారు. పదోన్నతుల విషయంలో అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నాలుగు జాతీయ సంఘాల కూటమికి అవకాశం

● చర్చలు జరుపుతున్న ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నేతలు

ఆంధ్రజ్యోతి,మంచిర్యాల: గుర్తింపు ఎన్నికల్లో నాలుగు జాతీయ కార్మిక సంఘాల కూటమి ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికే జాతీయ స్థాయిలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీల నాయకులు సింగరేణి ఎన్నికల్లో కలిసి పనిచేయడానికి నిర్ణయించారు. సీఐటీయూ, బీఎంఎస్ నాయకులతో కూడా చర్చలు జరపాలని ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్‌ప్రసాద్‌లు భావిస్తున్నారు. హెచ్ఎంఎస్ మాత్రం ఒంటరిగా బరిలో దిగే అవకాశం ఉంది.

సీఐటీయూ, బీఎంఎస్‌తోనూ మాట్లాడుతాం
-ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య

ఐఎన్‌టీయూసీతో ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయి. సీఐటీయూ, బీఎంఎస్ యూనియన్ నేతలతోనూ మాట్లాడతాం. అందరం ఒకే గుర్తుపై పోటీ చేస్తాం. జాతీయ కార్మిక సంఘాలు ఐక్యంగా ఉండాల్సిన సమయమిది. హెచ్ఎంఎస్ విముఖత వ్యక్తం చేస్తోంది. అయితే నాలుగు యూనియన్లు కలిసి ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

'సమస్యల పరిష్కారంలో గుర్తింపు సంఘం విఫలం'

మందమర్రి: సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి సాధనలో కార్మికులతో పాటు కీలక పాత్ర పోషిస్తున్న ట్రేడ్స్‌మెన్‌గా సమస్యలను పరిష్కరించడంలో గుర్తింపుసంఘం దారుణంగా విఫలమైందని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి శేషయ్య ధ్వజమెత్తారు. మంగళవారం సాయంత్రం 7 గంటలకు స్థానిక ఏఐటీయూసీ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన ఏరియా ట్రేడ్స్‌మెన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో తాము గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు మాత్రమే సాధించి పెట్టిన హక్కులే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ట్రేడ్స్‌మెన్‌లు వివిధ సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో యాంత్రీకరణ పెరిగిన నేపధ్యంలో ట్రేడ్స్‌మెన్‌పై పని భారం పెరుగుతుందని, ప్రమోషన్ విధానం కూడా పెంచాలన్నారు. గతంలో ట్రేడ్స్‌మెన్‌లకు రద్దు చేసినటువంటి హెల్పర్లను పునరుద్ధరించాలన్నారు. అండర్‌గ్రౌండ్‌లో పని చేస్తున్న ఫిట్టర్లు, ఎలక్ట్రీషన్‌లు అనారోగ్యం దృష్ట్యా అండర్‌గ్రౌండ్‌కు అన్‌ఫిట్ అయితే సూటబుల్ జాబులు ఇవ్వాలన్నారు. అండర్ గ్రౌండ్ నుంచి ఓపెన్‌కాస్టులకు వెళ్లే ట్రేడ్స్‌మెన్‌కు ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. ఎలక్ట్రికల్, మెకానికల్ సూపర్‌వైజర్లకు అలవెన్సులు ఇవ్వాలని పేర్కొన్నారు.

ఫిట్టర్లకు, ఎలక్ట్రీషన్లకు గనుల్లో పక్కా పని స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు వస్తున్నాయన్నారు. వారికి పని స్థలాలను కేటాయించాలని తెలిపారు. వీరి సమస్యలకు సంబంధించి అలుపెరుగని పోరాటాలు చేస్తుంది తామే అన్నారు. సింగరేణిలో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తామనే దీమాను ఆయన వ్యక్తం చేశారు. కార్మికుల ప్రయోజనాలే ప్రధాన ధ్యేయంగా పని చేస్తుంది తమ యూనియన్ అన్నారు. కార్మికులంతా సంఘటితంగా ఉండి తమ యూనియన్‌కు అండగా నిలిస్తే రానున్న భావి తరాల కార్మికుల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర కమిటి నాయకులు చిప్ప నర్సయ్య, పీ సుధర్శన్, ట్రేడ్స్‌మెన్ నాయకుడు రాందాస్, వెంకటస్వామి, సలేంద్ర సత్యనారాయణ, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జనవరి 19 నుంచి కాంట్రాక్టు కార్మికులకు పెంచిన వేతనాలు అమలు


మాట్లాడుతున్న కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ ఆవుల గోవర్ధన్

జైపూర్: కాంట్రాక్టు కార్మికులకు జనవరి 19 నుంచి సవరించిన వేతనాలు అమలు చేయాల్సి వుందని కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ ఆవుల గోవర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం పెగడపల్లి సింగరేణి విద్యుత్ ప్లాంట్‌ను సందర్శించిన ఆయన ప్లాంట్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టు కార్మికుల పూర్తి బాధ్యత సింగరేణిదేనని గోవర్ధన్ పేర్కొన్నారు. ప్రతి నెల 10 లోపు కార్మికులకు వేతనాలు అందేవిధంగా యాజమాన్యం చొరవ చూపాలని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుడి బ్యాంకు ఖాతాలోకే నేరుగా జీతం సొమ్ము చేరే విధంగా చూడాలన్నారు. జీతానికి సంబంధించి పే స్లిప్ ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వేతనాల చెల్లింపుల్లో అవకతవకలు, పనుల నిర్వహణలో ఇబ్బందులు గురించి అడిగారు. అనంతరం పవర్‌ప్లాంట్ సైటావీస్‌లో ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్‌కుమార్ సూర్, ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ రాజేశ్‌లను కలిసి ప్లాంట్‌కు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి పులి రాజిరెడ్డి, జాతీయ కమిటీ సభ్యులు భట్టాచార్య, సింగరేణి వర్కింగ్ ప్రెసిడెంట్ భూర్ల లక్ష్మీనారాయణ, బీజేపీ దళితమోర్చా రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇరుగు.. పొరుగు..

స్వచ్ఛ పఖ్వాడపై అవగాహన

భూపాలపల్లిటౌన్: స్వచ్ఛ పఖ్వాడపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమం సేవా సమితి ఆధ్వర్యంలో సీఈఆర్‌క్లబ్‌లో జరుగగా ముఖ్యఅతిథిగా పర్సనల్ మేనేజర్ ఎం.రాజేంద్రకుమార్ హాజరై ప్రసంగించారు. స్వచ్ఛ పఖ్వాడలో అన్ని ఏరియాల్లో కంటే భూపాలపల్లిని మొదటి స్థానంలో ఉంచాలని చెప్పారు. ఇందులో భాగంగా గృహిణులు ఇంటి శుభ్రత, పరిసరాల పరిశుభ్రత ఎలా ఉంచాలో పలు సూచనలు ఇచ్చారు. అలాగే పచ్చదనంతో కాలనీలు కలకలలాడాలని చెప్పారు. ఈ పఖ్వాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఏ సహాయం కావాలని అడిగిన అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎంవో మేరికుమారి హాజరై ఆరోగ్య సూత్రాలను చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ పీవో తిరుపతి, సంక్షేమ అధికారి మదార్‌సాహెబ్ ఉన్నారు.

'మెడికల్ బోర్డు పేరిట కార్మికులతో చెలగాటం'

మంథని(రామగిరి): మెడికల్‌బోర్డు పేరిట కార్మికుల జీవితాలతో సింగరేణి యాజమాన్యం చెలగాటం ఆడుతుందని ఏఐటీయూసీ ఆర్జీ-3 బ్రాంచీ సెక్రటరీ వై. విరావు ఆరోపించారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా 120 మంది, కేవలంలో ఆర్జీ-3 డివిజన్‌లో 16 మంది సంవత్సరాల తరబడి మెడికల్‌బోర్డుల చుట్టూ అన్‌ఫిట్ కోసం ప్రదక్షిణలు చేస్తున్నారని విమర్శించారు. వెంటనే మెడికల్ అన్‌ఫిట్ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత సంస్థపై ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు జూపాక రాంచందర్, సారా రమణయ్య, నరేష్, అడ్లూరి రాజయ్య, బెజ్జంకి వీరాచారిలు పాల్గొన్నారు.

నాణ్యత పేరుతో ఇన్సెంటివ్స్ ఎగవేత

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఓపెన్‌కాస్టు ప్రాజెక్టుల్లో నాణ్యత పేరుతో మూడు నెలలుగా ఇన్సెంటివ్ చెల్లించకుండా కార్మికులకు ఆర్థిక నష్టం చేస్తున్నారని టీబీజీకేఎస్ కేంద్ర కమిటి నాయకుడు మంద మల్లారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఓసీపీలో ఉత్పత్తి లక్ష్యాలు సాధిస్తున్నప్పటికి కనీసం 85శాతం నాణ్యత గ్రేడ్ రావడం లేదని తప్పుడు రిపోర్టులు ఇస్తూ ఇన్సెంటివ్ రాకుండా చేస్తున్నారని ఆరోపించారు.

'కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం'



మాట్లాడుతున్న సీఐటీయూ కార్యదర్శి ఎస్ఎస్‌బేగ్

మంథని(రామగిరి): కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని సీఐటీయూ ఆల్‌ఇండియా కార్యదర్శి ఎస్.ఎస్.బేగ్ అన్నారు. మంగళవారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సీఐటీయూ రాష్ట్ర మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి వేదికైన జేబీసీసీఐ నుంచి సింగరేణి సంస్థను విడదీయాలనే కుట్రను భగ్నం చేసి తిరిగి సాధించామన్నారు. సకల జనుల సమ్మె వేతనాల్లో తప్పుడు లెక్కలు వెలికితీసి దాదాపు పది వేల మందిలో 3,500 మంది కార్మికులకు న్యాయం చేసిన ఘనత సీఐటీయుకే దక్కిందన్నారు. మెరుగైన 10వ వేతన ఒప్పందం అమలుకు కృషి చేస్తున్నామన్నారు. సీఎంపీఎఫ్‌ను ఈపీఎఫ్‌లో విలీనం చేయడంతో జరిగే నష్టం వివరించడంతో సీఐటీయు ప్రముఖ పాత్రను పోషించిందన్నారు. ఎలాంటి అధికారం లేకున్న కార్మికుల పక్షాన నిల్చున్న ఏకైక సంఘం సీఐటీయు యూనియన్‌గా అభివర్ణించారు. కార్మికులు ఐక్యంగా ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సభలో రాష్ట్ర నాయకులు రాజారావు, రాజారెడ్డి, మధు, మంద నర్సింహారావు, సాయిబాబు,బేగ్, ఆర్జీ-3 కార్యదర్శి కొంరయ్య, నాయకులు ప్రభాకర్,కుమార్, సీహెచ్ ఎల్లయ్య, సుధాకర్, ఎండి పాషా,విజయ్‌కుమార్, తిరుమలయ్య పాల్గొన్నారు.

'టీబీజీకేఎస్‌కు గుణపాఠం తప్పదు'

యైటింక్లయిన్‌కాలనీ: కార్మికుల సమస్యలను పట్టించుకోని టీబీజీకేఎస్‌కు గుణపాఠం తప్పదని హెచ్ఎంఎస్ ఆర్జీ-2 ఉపాధ్యక్షుడు దశరథం పేర్కొన్నారు. మంగళవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులపై అధికారుల వేధింపులను అడ్డుకోలేక పోయారని, యాజమాన్యంకు అనుకూలంగా వ్యవహరించి కార్మికులకు అన్యాయం తలపెట్టినట్టు ఆరోపించారు. ఓసీపీ-3 బేస్‌వర్క్ షాప్‌లో గేట్లు మూసివేసి నిర్బంధ పనులు చేయిస్తే అడ్డుకున్నట్లు, ప్రతిగా రియాజ్‌పై యాజమాన్యం అట్రాసిటీ కేసు నమోదు చేయించినట్టు తెలిపారు. కార్మికుల సమస్యలపై ఏనాడూ స్పందించని ప్రజాప్రతినిధులు ఎన్నికల వేళ గనుల పైకి వచ్చి మాయమాటలు చెప్పే నమ్మవద్దని సూచించారు. ఈగేట్‌మీటింగ్‌లో వీరస్వామి, మధునయ్య, గోపాల్‌రెడ్డి, రామయ్య, సోమయాజులు, పినకాశిమొగిలితోపాటు కార్మికులు పాల్గొన్నారు.

సూక్తి

మనకోసం చేసే పని మనతోనే అంతరించిపోతుంది. పరుల కోసం చేసేది శాశ్వతంగా నిలుస్తుంది.


జంబ్లింగ్ వర్డ్స్

1. LMIK ▸ ....
2. DYUT ▸ ....
3. ALTS ▸ ....
4 RCKO ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

ఔనా!

2007లో ఓ గూఢచర్యం కేసులో 14 ఉడతలను ఇరాన్ పోలీసులు అరెస్టు చేశారు.



పదాలు కనుక్కోండి



ASTER, CROCUS, DAFFODIL, DAISY, GERANIUM, HONEYSUCKLE, LAVENDER, LILAC, LILY, MARIGOLD, ORCHID, PANSY, SUNFLOWER, TULIP, VIOLET

పాండాలకు ఓ ఆసుపత్రి



నలుపు, తెలుపు రంగుల్లో ముద్దుగా కనిపించే పాండాలంటే.. చాలామందికి ఇష్టం. పాండాలను అంతరించిపోతున్న జాతులలో ఒకటిగా గుర్తించారు. వీటిని పరిరక్షించడానికి పర్యావరణవేత్తలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే 'చైనా కన్జర్వేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ ది గెయింట్ పాండా (సీసీఆర్‌సీజీపీ) పనిచేస్తుంది. రోజు రోజుకీ తగ్గిపోతున్న పాండాల సంఖ్యను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో చైనా ప్రభుత్వం 'డుజియాంగ్యాన్' నగరంలో పాండాల కోసమే ప్రత్యేకంగా ఓ ఆసుపత్రిని 2012లో ప్రారంభించింది. ఇది ప్రపంచంలోనే తొలి పాండా ఆసుపత్రి.

జలుబు చేసినా.. జ్వరం వచ్చినా.. డాక్టరు దగ్గరకు వెళుతుంటాం. మరి పాండాలకు జబ్బు చేస్తే? అనారోగ్యంతో అవి బాధపడుతుంటే? అందుకే వాటికోసం ప్రత్యేకంగా ఓ ఆసుపత్రి ఉంది. అందులో పాండాలను ఎంతో బాధ్యతగా చూసుకుంటారు. ప్రతి రోజూ హెల్త్ చెకప్‌లు చేస్తారు.. మంచి భోజనాన్ని అందిస్తారు. ఇది పాండాల పునరావాస కేంద్రం కూడా. అంతేకాదు ఇక్కడ పాండాలపై పరిశోధనలు చేస్తారు.

పాండాలపై పరిశోధన చేసిన తొమ్మిదిమంది వైద్యులు ఈ హాస్పిటల్‌లో పని చేస్తున్నారు. ఈ వైద్య బృందం పాండాలకి ఎలాంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. పాండాలు వ్యాధుల భారినా పడితే తక్షణమే వాటికి వైద్యం చేస్తారు. పాండాల సంతతిని అభివృద్ధి చెందేలా ఆసుపత్రి వైద్యులు కృషి చేస్తారు. అత్యున్నత సాంకేతిక వ్యవస్థ ఈ ఆసుపత్రిలో ఉంది. ఇది కేవలం పాండాల ఆరోగ్యాన్ని పరిరక్షించే ఆసుపత్రి మాత్రమే కాదు ఇది పాండాల ఉనికిని కాపాడే సంస్థగా కూడా పనిచేస్తుంది. ఈ ఆసుపత్రిలో మొత్తం 33 పాండాలు ఉన్నాయి. 'పాన్ పాన్' అనే పాండా అన్నింటికన్నా వయసులో పెద్దది. దాని వయసు 33 సంవత్సరాలు. పాండాల కోసం ఈ ఆసుపత్రి చేసిన కృషి వల్లే పాండాల సంఖ్య 17 శాతానికి పెరిగింది.


- పాండాల కోసం క్యారెట్లు, పాలు, కార్న్ బ్రెడ్ వంటి ఆహారపదార్థాల్ని అందిస్తారు.
- మనుషులతో ఎలా ప్రవర్తించాలో పాండాలకు చక్కగా నేర్పుతారు.
- అడవుల్లో ఒంటరిగా సంచరించే పాండాలను, ప్రకృతి వైపరీత్యాల వల్ల కష్టాల్లో పడిన పాండాలను ఆసుపత్రికి తీసుకువచ్చి వాటిని సంరక్షిస్తారు.
- పాండాలకి ఇష్టమైన ఆహారం వెదురు చెట్లని తెలుసు కదా. పాండాల ఆహారం కోసమే ఆసుపత్రి యజమాన్యం వేల వెదురు చెట్లను పెంచుతుంది. పాండాలు హాయిగా అందులో విహరిస్తాయి. చక్కగా ఆడుకుంటాయి.




మీకు తెలుసా

- పాండా బరువు 100 నుంచి 120 కేజీల మధ్యలో ఉంటుంది.
- వీటి సగటు వయస్సు 20 సంవత్సరాలు.
- ఇప్పటి వరకూ 'బసి' అనే పాండా గరిష్ఠంగా 37 సంవత్సరాలు జీవించింది.
- పాండాలు తమ పిల్లలకి పాలిచ్చి పెంచుతాయి.
- ప్రపంచ వ్యాప్తంగా 1,864 పాండాలు మాత్రమే ఉన్నాయి.

దారి కనుక్కోండి



మీకు తెలుసా?



మీరు చంద్రుడి పైకి వెళితే.. మీరు మీ బరువులో 16.5 శాతమే ఉంటారు.

టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

చెప్పగలరా?

మందులో ఉన్నా
కానీ ముందులో లేను
దాతలో ఉన్నా
కానీ పీతలో లేను
రంగులో ఉన్నా
కానీ చెంగులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జంతర్‌మంతర్

1. స్వభవిత్తు ▸ ....
2. మాణంరాయ ▸ ....
3. వృఅభిద్ధి ▸ ....
4. సంవరంత్స ▸ ....

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : కోడి మాంసా హారా? శాకాహారా?
బిట్టు : మాంసాహారికి ఆహారం టీచర్!
టీచర్ : !!!!!!!!


జవాబులు

చెప్పగలరా? : సున్నా

జంతర్‌మంతర్ :
1. భవిష్యత్తు
2. రామాయణం
3. అభివృద్ధి
4. సంవత్సరం

జంబ్లింగ్ వర్డ్స్ :
1. MILK
2. DUTY
3. SALT
4 ROCK

బొమ్మ గీయండి





రేపే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00

PRASADS 9.15,10.00,10.40,1.00,4.00,7.00,10.30 తమిళ్: 10.45,1.15,7.15, బిగ్ స్క్రీన్: 9.15PM
PVR మాదాపూర్ 10.20,11.35,1.30,4.40,7.50,11.00
PVR బంజారాహిల్స్ 10.15,1.00,7.25,11.00
PVR పంజాగుట్ట 10.00,1.10,4.20,7.30,10.30
PVR 10.00,11.05,1.10,1.40,4.20,5.10,7.30,10.40, తమిళ్: 4.00PM
INOX బంజారాహిల్స్ 10.00,11.15,12.45,4.10,6.50,10.10
INOX 10.20,12.40,3.40,4.45,6.40,10.20
Cinemas AMEERPET అమీర్‌పేట్ 10.40,1.40,4.20,7.50,10.40
Cinemas SHAMEERPET ఎ/సి - శామీర్‌పేట్ 10.40,4.40,10.40

Cinépolis 10.20,4.30,10.40, తమిళ్: 1.25,7.35
Cinépolis 10.00,1.05,4.10,7.15,10.20, తమిళ్: 2.00,5.25
Cinépolis 10.00,1.05,4.10,7.15,10.20, తమిళ్: 2.00,8.00
TIVOLI సికింద్రాబాద్ 10.40,1.30,4.25,7.25
Cine Planet - కొంపల్లి 10.30,1.20,7.40,10.20
దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,5.00,8.00,10.20
ఎ/సి -ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్
ASIAN - ఉప్పల్ 10.45,1.40,4.35,7.30,10.25
లక్ష్మీకళ సినీప్రైడ్ ఎ/సి - మూసాపేట్
ASIAN - కూకట్‌పల్లి 10.40,4.35,7.35,10.20

ASIAN - అత్తాపూర్ 10.30,1.25,4.35,7.00,10.30
ASIAN రాధికా - కాప్రా 10.50,4.30,10.30
ASIAN గంగ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15
సినీటౌన్ - మియాపూర్ 11.00,2.15
ASIAN ఎ/సి - చింతల్ 11.30,6.30,9.30
ASIAN - హన్మకొండ 10.40,1.40,4.10,7.05
GEETHA ASIAN - నిజామాబాద్ 10.40,1.35,4.35,10.30
ప్రతిమ ఎ/సి - కరీంనగర్
- వరంగల్ 11.30,3.00,6.30,9.30

MULTIPLEX విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 10.45AM, 7.30PM
మహాలక్ష్మి ఎ/సి - కొత్తపేట 11.15,2.15
సప్న ఎ/సి - అబిడ్స్ 11.15,2.15,6.00,9.00
గెలాక్సి - టోలిచౌకి 11.00,2.00,6.00,9.00
శ్రీనివాస - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00
నర్తకి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30
శివశక్తి - కాప్రా 11.00,2.00,6.00,9.00
ఆరాధన - తార్నాక 11.00,2.00,6.00,9.00
స్వప్న 70 ఎ/సి - కాటేదాన్ 11.15,2.15,6.00
కళ్యాణి - బోయిన్‌పల్లి 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
శ్రీప్రేమ - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00
శారదా - కాప్రా 11.00,2.00,6.00,9.00
సంతోష్ - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00

ఒక్క రోజు మాత్రమే:

సత్యం - అమీర్‌పేట్ 11.45,2.45,6.45,9.45
వైజయంతి - నాచారం 11.00,2.00,6.00,9.00
విజేత - బోరబండ 11.00,2.00,6.00,9.00
సూపర్ - బాలాపూర్ 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట్ 11.00,2.00,6.00,9.00
విమల్ - బాలానగర్ 11.00,2.00,6.00,9.00
శ్రీరామా - బహుదూర్‌పుర 11.00,2.00,6.00,9.00
రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15

